



ప్రజా చైతన్యమే...

# లక్ష్యం

తెలుగు దినపత్రిక






ఎడిటర్ ఇన్ చీఫ్-మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010

Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.

సంపుటి : 12 సంచిక : 193 శనివారం 23-08-2025 పేజీలు : 8 వెల :3/-



LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only


## కేసీఆర్ పాలనను, ఇప్పటి పాలనను పోల్చుతూ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

- ఎరువుల కొరతపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించిన కేటీఆర్
- కేసీఆర్ హయాంలో రైతులు ఏనాడూ రోడ్డెక్కలేదన్న కేటీఆర్
- యూరియా కోసం కేసీఆర్ ప్రత్యేక ప్రణాళికలు వేసేవారని వెల్లడి ప్రస్తుత ప్రభుత్వ అసమర్థత వల్లే రైతులకు కష్టాలు అని ఆరోపణ
- రైతులను ఇబ్బంది పెట్టేవారి పతనం ఖాయమంటూ హెచ్చరిక



హైదరాబాద్ : తెలంగాణలో నెలకొన్న ఎరువుల కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎంతో ముందుచూపుతో వ్యవహరించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశారని, కానీ ప్రస్తుత పాలనలో అన్నదాతలు రోడ్డెక్కే దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా బస్తాల కోసం రైతులు వ్యవసాయ సహకార సంఘాల వద్ద బారులు తీరుతున్నారని, ధర్నాలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ పాలనలో ఒక్కసారి కూడా రైతులు ఎరువుల

మిగితా 2లో

## జైల్లో ఉన్న పీఎం, సీఎంలను తొలగించే బిల్లు.. కేజ్రీవాల్ అంశాన్ని ప్రస్తావించిన అమిత్ షా



- జైల్లో ఉన్న మంత్రులను తొలగించేందుకు కేంద్రం కొత్త బిల్లులు
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వల్లే ఈ చట్టాలు తేవాల్సి వచ్చిందన్న అమిత్ షా
- కేజ్రీవాల్ రాజీనామా చేసి ఉంటే ఈ బిల్లులు అవసరం అయ్యేవి కాదని స్పష్టం
- జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడాన్ని దేశ ప్రజలు కోరుకుంటారా అని ప్రశ్న
- రాజ్యాంగ నిర్మాతలు ఇలాంటి పరిస్థితిని ఊహించలేదని వ్యాఖ్య
- ప్రజాస్వామ్యంలో నైతికతను కాపాడటం అందరి బాధ్యత అని సూచన

# నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ..

## ఏపీకి రూ.5,000 కోట్లు కావాలని విజ్ఞప్తి

- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీకి అదనంగా రూ.5,000 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి
- పెండింగ్‌లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం ఈ నిధులు కోరిన సీఎం
- రాష్ట్రాల ప్రత్యేక సహాయ పథకం కింద సాయం అందించాలని అభ్యర్థన
- గతంలో ఇదే పథకం ద్వారా రాష్ట్రానికి రూ. 2,010 కోట్లు వచ్చాయని వెల్లడి



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా నేడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అదనంగా రూ.5,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు. ఈ మేరకు ఆయన ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రాల మూలధన పెట్టుబడుల కోసం కేంద్రం అందిస్తున్న ప్రత్యేక సహాయ పథకం కింద ఈ నిధులను కేటాయించాలని చంద్రబాబు తన వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో ఇదే పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,010 కోట్లు మంజూరైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి ప్రారంభించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ఈ అదనపు నిధులు అత్యవసరమని ఆయన వివరించినట్లు తెలిసింది. ఈ ప్రత్యేక నిధులతో పాటు, రాష్ట్రంలో చేపట్టబోయే పలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కూడా కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలని ముఖ్యమంత్రి అభ్యర్థించారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర సహకారం ఎంతో కీలకమని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సమావేశంలో చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా పాల్గొన్నారు.

**కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహాలపై సీఎం చంద్రబాబు సమీక్ష**

గోదావరి, కృష్ణా నదులకు ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహాలు, వరదల పరిస్థితిపై సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ నుంచి సీఎస్ కె.విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాలతో పాటు ఇతర ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా తాజా పరిస్థితులపై సీఎం ఆరా తీశారు. రెండు నదులకు వస్తున్న వరద ప్రవాహాలు, పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు, నివాస సముదాయాలకు సంబంధించి అధికారులు సీఎంకు వివరించారు. కృష్ణా నదికి ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో శ్రీశైలం నుంచి 5.20 లక్షలు, నాగార్జున సాగర్ నుంచి 4.32 లక్షలు, పులిచింతల నుంచి 4.07 లక్షలు, ప్రకాశం బ్యారేజ్ నుంచి 4.53 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. గోదావరి నదిలోనూ భారీగానే వరద ప్రవాహం వస్తోందని, ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి

మిగితా 2లో



# అవినీతిపై సరికొత్త అస్త్రం..

2లో

## - జైలు నుంచి ఫైళ్లపై సంతకాలు చేసే రోజులు పోయాయి: ప్రధాని మోదీ

- అవినీతిపై కొత్తగా తెచ్చిన మూడు బిల్లులను సమర్థించిన ప్రధాని మోదీ
- తీవ్ర ఆరోపణలతో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ తప్పనిసరి అని వెల్లడిబెయిల్ రాకపోతే 31వ రోజు పీఎం, సీఎం పదవికి రాజీనామా చేయాలి
- జైలు నుంచి ఫైళ్లపై సంతకాలు చేసే రోజులు పోయాయంటూ పరోక్ష విమర్శలు
- కొత్త చట్టాలంటే ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని ఎద్దేవా
- కాంగ్రెస్, ఆర్జేడీల అవినీతిపై బీహార్ సభలో తీవ్ర స్థాయిలో ధ్వజం

## చైనాలో చరిత్రలోనే అతిపెద్ద సదస్సు!

### మోదీ సహా హాజరుకానున్న 20 మంది ప్రపంచ నేతలు



- చైనాలోని టియాంజిన్‌లో జరగనున్న ఎస్సీఓ శిఖరాగ్ర సదస్సు
- చరిత్రలోనే అతిపెద్ద సమావేశంగా చైనా ప్రకటన
- ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు రెండు రోజుల భేటీ
- హాజరుకానున్న ప్రధాని మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌తో పాటు 20 మంది నేతలు
- పాల్గొననున్న ఐరాస సెక్రటరీ జనరల్, ఇతర అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు
- సదస్సు ద్వారా తమ ప్రాబల్యాన్ని చాటుకోవాలని చూస్తున్న చైనా

2లో

## ఆరు రోజుల వరుస లాభాలకు నేడు బ్రేక్

- భారీ నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ
- అమెరికా ఫెడ్ ఛైర్మన్ ప్రసంగంపై ఇన్వెస్టర్లలో ఆందోళన
- సెన్సెక్స్ 693 పాయింట్లు, నిఫ్టీ 213 పాయింట్లు పతనం
- డాలర్‌తో పోలిస్తే 25 పైసలు బలహీనపడిన రూపాయి
- బ్యాంకింగ్, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి



2

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టు... తీవ్రంగా స్పందించిన బండి సంజయ్



2లో

- కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే పయనిస్తోందని విమర్శ
- అరెస్టులతో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని ప్రభుత్వం చూస్తోందని ఆగ్రహం
- బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని ఈటల రాజేందర్ ఆగ్రహం

# నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ..

13,42,307 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోందని సీఎంకు వివరించారు. గోదావరి వరదల కారణంగా పరీవాహక ప్రాంతంలోని లంక గ్రామాలు, పోలవరం ముంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని అధికారులు వివరించారు. ఈ ప్రాంతాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అధికార యంత్రాంగం సమస్య వచ్చిన తరువాత స్పందించటం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగానే సన్నద్ధతతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. వరదలు, భారీ వర్షాలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు నిరంతరం కచ్చితమైన సమాచారం ఇచ్చి...తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా చూడాలని చెప్పారు.

**ఎరువుల కొరత లేకుండా చర్యలు**

రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందుల లభ్యత, సరఫరా అంశంపైనా సీఎం సమీక్ష చేశారు. ఎరువుల కొరత అనే సమస్య లేకుండా అధికార యంత్రాంగం పనిచేయాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విజిలెన్స్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎరువులు దారి మళ్లకుండా, ధర పెరగకుండా చూడాలని సీఎం సూచించారు. ఎరువుల కొరత అనే సమస్య ఉన్నట్లు ఎక్కడ నుంచి సమాచారం వచ్చినా, రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ధరియాల తిప్ప సమీపంలో సముద్రంలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్ లీక్ ఘటన పైనా సీఎం అధికారులతో మాట్లాడారు.

రాత్రి 1.30 గంటలకు గ్యాస్ లీక్ తో మంటలు భారీగా ఎగిసి పడ్డాయని గంటన్నర వ్యవధిలోనే గ్యాస్ సరఫరా నిలిపివేసి లీక్ ను అరికట్టారని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగలేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. లీక్ అయిన పైప్ ను మొత్తం తనిఖీ చేసి సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# కేసీఆర్ పాలనను, ఇప్పటి పాలనను పోల్చుతూ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

కోసం రోడ్డెక్కలేదని ఆయన గుర్తు చేశారు.

ఇది కదా నాయకత్వం అంటే, ఇది కదా ముందుచూపు అంటే అంటూ కేసీఆర్ పాలనలో తీసుకున్న చర్యలను ఆయన వివరించారు.కేసీఆర్ నాయకత్వ పటిమను, ఆయన ముందుచూపును కేటీఆర్ ఈ సందర్భంగా వివరించారు. "సీజన్‌కు ముందే వ్యవసాయ అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించి, కేంద్రానికి కచ్చితమైన లెక్కలతో వినతులు పంపేవారు. ఏపీలోని నౌకాశ్రయాలకు మన అధికారులను పంపి, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి 25 ప్రత్యేక గూడ్స్ రైళ్లను ఏర్పాటు చేయించేవారు. అంతేకాకుండా, పొరుగు రాష్ట్ర రవాణా మంత్రులతో నేరుగా సంప్రదించి సుమారు 4 వేల లారీలను సిద్ధం చేసి, పోర్టుల నుంచి నేరుగా మండలాలకు యూరియా చేరేలా పక్కా ప్రణాళికలు రచించేవారు" అని కేటీఆర్ తెలిపారు. "పరిపాలన చేతకాని అసమర్థులు రాష్ట్రాన్ని ఏలడం వల్లే రైతులకు ఈ కన్నీళ్లు మిగిలాయని" కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. "ఒకవైపు కేసీఆర్ వందేళ్ల విజన్‌తో పనిచేస్తే, మరోవైపు కొందరికి విమర్శలు చేయడం తప్ప పనులు చేయడం రాదని ప్రజలు గ్రహించారని" అన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారి పతనం ప్రారంభమైందని ఆయన హెచ్చరించారు. "జై కిసాన్.. జై కేసీఆర్" నినాదంతో తన వ్యాఖ్యలను ముగించారు.

# జైల్లో ఉన్న పీఎం, సీఎంలను తొలగించే బిల్లు.. కేజ్రీవాల్ అంశాన్ని ప్రస్తావించిన అమిత్ షా

**న్యూఢిల్లీ :** తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలతో జైలు పాలైన ప్రధాని, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు లేదా రాష్ట్ర మంత్రులను పదవుల నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన నూతన బిల్లుల వెనుక ఉన్న అసలు కారణాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచే ప్రభుత్వాన్ని నడిపిన ఉదంతం కారణంగానే ఈ బిల్లులను తీసుకురావాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ కేజ్రీవాల్ అరెస్ట్ అయిన వెంటనే తన పదవికి రాజీనామా చేసి ఉంటే, ఈ రోజు ఈ మార్పులు అవసరం అయ్యేవి కావని ఆయన అభిప్రాయపడ్డారు. కేరళలో జరిగిన మనోరమ న్యూస్ కాన్క్లేవ్‌లో అమిత్ షా మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదని గుర్తుచేశారు. "ఒక ముఖ్యమంత్రి జైల్లో ఉండి ప్రభుత్వాన్ని నడపాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారా? ఇది ఎలాంటి చర్చో నాకు అర్థం కావడం లేదు. ఇది పూర్తిగా నైతికతకు సంబంధించిన ప్రశ్న" అని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని రూపొందించిన సమయంలో, జైలుకు వెళ్లిన వారు కూడా పదవుల్లో కొనసాగుతారని ఎవరూ ఊహించి ఉండరని ఆయన అభిప్రాయపడ్డారు. తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలపై వరుస గా 30 రోజుల పాటు అరెస్ట్ లేదా నిర్బంధంలో ఉన్న ప్రజాప్రతిని ధులను పదవుల నుంచి తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంటులో మూడు బిల్లులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అయ్యాక, రాజీనామా చేసేందుకు నిరాకరించిన విషయాన్ని అమిత్ షా ఈ సందర్భంగా ప్రస్తావించారు. "ఒక ముఖ్యమంత్రి జైలు నుంచి పాలన సాగించిన ఘటన జరిగింది.

మరి రాజ్యాంగాన్ని సవరించాలా, వద్దా? గతంలో బీజేపీ ప్రభుత్వాలు కూడా అధికారంలో ఉన్నాయి, కానీ మాకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు" అని అమిత్ షా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ నైతికతను కాపాడాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండింటిపైనా ఉంటుందని ఆయన అన్నారు.

# ఆరు రోజుల వరుస లాభాలకు నేడు బ్రేక్

ఆరు రోజుల పాటు లాభాల్లో పరుగులు పెట్టిన దేశీయ స్టాక్ మార్కెట్లకు శుక్రవారం బ్రేక్ పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ ప్రసంగానికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించడంతో సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి వెల్లువెత్తింది. దీంతో గత మూడు రోజులుగా ఆర్జించిన లాభాలను మార్కెట్లు ఒక్కరోజే కోల్పోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 693.86 పాయింట్లు నష్టపోయి 81,306.85 వద్ద స్థిరపడింది. ఉదయం 81,951.48 వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్, రోజంతా అమ్మకాల ఒత్తిడితో 81,291.77 వద్ద ఇంట్రా-డే కనిష్ఠాన్ని తాకింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 213.65 పాయింట్లు దిగజారి 24,870.10 వద్ద ముగిసింది.

దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ బ్యాంక్ 1.09 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.96 శాతం, ఎఫ్ఎంసీజీ 1 శాతం, ఐటీ 0.79 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ లో ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి ప్రధాన షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా బలహీనపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో రూపాయి విలువ 25 పైసలు క్షీణించి 87.50 వద్ద ముగిసింది. రష్యాకు వ్యతిరేకంగా భారత్‌పై అమెరికా వాణిజ్య సుంకాలను వ్యూహాత్మకంగా ప్రయోగిస్తుండడం వంటి ఆందోళనలు కూడా సంస్థాగత ఇన్వెస్టర్లను ప్రభావితం చేసినట్టు తెలుస్తోంది. ముడిచమురు ధరలు, ప్రపంచ పరిణామాలు కూడా సమీప భవిష్యత్తులో మార్కెట్లను నిర్దేశించే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# పసుపు, అల్లం రెండింటినీ కలిపి రోజూ తినండి.. అనేక లాభాలను పొందవచ్చు..!

పసుపు, అల్లం ఒకే జాతికి చెందినవి. వీటి కొమ్ములు (వేర్లు) ఒకే రకంగా ఉంటాయి. ఇవి అనే జాతికి చెందిన వేరు మొక్కలు. ఇవి రెండూ దాదాపుగా ఒకే రకమైన ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. వీటిని మనం వంటల్లో రోజూ వాడుతూనే ఉంటాం. అయితే ఈ రెండింటి కాంబినేషన్ ఎంతో శక్తివంతమైందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. పసుపు, అల్లాన్ని కలిపి రోజూ తీసుకుంటే అనేక లాభాలు ఉంటాయని అంటున్నారు. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే పలు అనారోగ్య సమస్యలను నయం చేసుకోవచ్చు. ఇందులో జింజరాల్‌తోపాటు కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇవి మనకు కలిగే వ్యాధులను నయం చేయడంలో ఎంతో సహాయం చేస్తాయి. అందువల్ల ఈ రెండింటి మిశ్రమాన్ని రోజూ తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



**నొప్పులు, వాపులకు..** పసుపు, అల్లం మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల వాటిల్లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఆర్థరైటిస్ సమస్యను తగ్గిస్తాయి. కీళ్ల నొప్పులు, వాపులు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. దీని వల్ల నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు సైతం తగ్గిపోతాయి. దీంతో డయాబెటిస్, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ఈ మిశ్రమంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి కణాలను రక్షిస్తాయి. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీని వల్ల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**సీజనల్ వ్యాధులకు..** ఈ మిశ్రమంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక దీన్ని తింటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఈ మిశ్రమంలో సహజసిద్ధమైన యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. జ్వరం నుంచి కూడా త్వరగా కోలుకుంటారు. కనుక ఈ సీజన్‌లో ఈ మిశ్రమాన్ని మరిచిపోకుండా రోజూ తినాలి. దీన్ని తింటే జీర్ణ వ్యవస్థ సైతం ఆరోగ్యంగా ఉంటుంది. వికారం, కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు. పైత్య రసం సరిగ్గా ఉత్పత్తి అవుతుంది. ఇది మనం తిన్న ఆహారాన్ని సరిగ్గా జీర్ణం అయ్యేలా చేస్తుంది. దీంతో ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీని వల్ల పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..** పసుపు, అల్లం మిశ్రమాన్ని తింటుంటే హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. దీన్ని తింటే బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం పసుపు, అల్లం మిశ్రమంలో న్యూరో ప్రొటెక్టివ్ గుణాలు ఉంటాయి. అంటే ఈ మిశ్రమాన్ని తింటే మెదడు సైతం ఆరోగ్యంగా ఉంటుందన్నమాట. మెదడులో ఉండే వాపులు తగ్గిపోతాయి.

వయస్సు మీద పడడం వల్ల వచ్చే మతిమరుపు సమస్య రాకుండా అడ్డుకోవచ్చు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మెదడు యాక్టివ్‌గా మారి చురుగ్గా పనిచేస్తుంది. బద్ధకం పోతుంది. రోజూ చిన్న అల్లం ముక్కను కాస్త దంచి అందులో కొద్దిగా పసుపు కలిపి తినవచ్చు. లేదా నీటిలో ఈ రెండింటినీ వేసి మరిగించి ఆ నీళ్లను కూడా తాగవచ్చు. ఇలా పసుపు, అల్లం మిశ్రమం మనకు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టు... తీవ్రంగా స్పందించిన బండి సంజయ్

**హైదరాబాద్ :** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అరెస్టును కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతుండగా అరెస్టు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే పయనిస్తోందని విమర్శించారు. అరెస్టులతో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. రాంచందర్ రావును, పార్టీ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**అరెస్టులపై ఈటల రాజేందర్ ఆగ్రహం**

బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శి ంచారు. ఈ ప్రభుత్వం చేయాల్సింది అరెస్టులు కాదని, సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. నిరంకుశ విధానాలు మానకపోతే ప్రజాక్షేత్రంలో మట్టి కరవడం ఖాయమని జోస్యం చెప్పారు. కాగా, జీహెచ్‌ఎంసీలో సమస్యల పరిష్కారం కోరుతూ బీజేపీ నేడు సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. మొయినాబాద్ వద్ద పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# చైనాలో చరిత్రలోనే అతిపెద్ద సదస్సు!

**చైనా :** చైనాలోని టియాంజిన్ నగరం ఒక భారీ అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సమావేశం ఈ నెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనుందని, ఇది సంస్థ చరిత్రలోనే అతిపెద్దదిగా నిలవనుందని చైనా శుక్రవారం ప్రకటించింది. ఈ కీలక సమావేశానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా సుమారు 20 మంది ప్రపంచ దేశాల అధినేతలు హాజరుకానున్నారు.ఈ వివరాలను చైనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి లియు బిన్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎస్సీఓ కూటమికి ఈ ఏడాది చైనా అధ్యక్షత వహిస్తోందని, ఆతిథ్య దేశంగా నిర్వహిస్తున్న ఐదో సదస్సు ఇదేనని ఆయన తెలిపారు.

ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారని ధృవీకరించారు. వీరితో పాటు టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రభోవో సుబియాంటో, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ చిన్ వంటి ప్రముఖ నేతలు కూడా ఈ భేటీలో పాల్గొంటారని లియు బిన్ వివరించారు. దక్షిణాసియా నుంచి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కూడా హాజరవుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌తో పాటు 10 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు రానున్నారు. ప్రస్తుతం ఎస్సీఓ కూటమిలో రష్యా, భారత్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్, చైనా సభ్యదేశాలుగా ఉన్నాయి.

# అవినీతిపై సరికొత్త అస్త్రం..

**న్యూఢిల్లీ :** అవినీతిపై తమ ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించబోతోందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. తీవ్రమైన అవినీతి ఆరోపణలతో అరెస్టయిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు 30 రోజుల్లోగా బెయిల్ పొందలేకపోతే, 31వ రోజున తమ పదవులకు రాజీనామా చేయాల్సిందేనని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన మూడు కొత్త బిల్లులను ఆయన గట్టిగా సమర్థించారు. శుక్రవారం బీహార్‌లోని గయలో జరిగిన ఓ బహిరంగ సభలో ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ కొత్త చట్టాలను చూసి ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయో ప్రజలందరికీ తెలుసని మోదీ చురకలంటించారు. ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ అవినీతి నిరోధక బిల్లుల పరిధిలోకి దేశ ప్రధాని కూడా వస్తారని ఆయన గుర్తుచేశారు. "ఈ చట్టం అమల్లోకి వస్తే, ఏ ముఖ్యమంత్రి, మంత్రి లేదా ప్రధానమంత్రి అయినా అరెస్ట్ అయిన 30 రోజుల్లోగా బెయిల్ తెచ్చుకోవాలి. లేదంటే వారు తమ పదవిని వదులుకోవాల్సి ఉంటుంది" అని ప్రధాని వివరించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం, ఒక చిన్న ప్రభుత్వ ఉద్యోగి 50 గంటల పాటు అదుపులో ఉంటే సస్పెండ్ అవుతాడని, కానీ ముఖ్యమంత్రులు, మంత్రులు మాత్రం జైల్లో ఉంటూ కూడా అధికార ప్రయోజనాలను అనుభవిస్తున్నారని మోదీ అన్నారు.

ఇటీవల కాలంలో జైలు నుంచే ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం చూశామని, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. నాయకుల తీరు ఇలా ఉంటే అవినీతిపై పోరాటం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. స్వాతంత్ర్యం తర్వాత 60-65 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అవినీతి కేసులు లెక్కలేనన్ని ఉన్నాయని, కానీ తమ ప్రభుత్వానికి ఒక్క అవినీతి మరక కూడా అంటలేదని మోదీ అన్నారు. బీహార్‌లోని ఆర్జేడీ అవినీతి గురించి ప్రతి చిన్న పిల్లాడికి కూడా తెలుసని ఎద్దేవా చేశారు. అవినీతిపై పోరాటాన్ని చివరి వరకు తీసుకెళ్లాలంటే ఎవరినీ వదిలిపెట్టకూడదనేది తన గట్టి నమ్మకమని చెప్పారు. కాంగ్రెస్, ఆర్జేడీ ప్రభుత్వాలు ప్రజాధనం విలువను ఎన్నడూ గుర్తించలేదని, తమ ఖజానాలు నింపుకోవడానికే దాన్ని ఉపయోగించాయని ఆరోపించారు. అందుకే వారి హయాంలో ప్రాజెక్టులు ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉండేవని, ప్రాజెక్టు ఆలస్యమయ్యే కొద్దీ దాని నుంచి డబ్బులు దండుకునేవారని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు.

# చిన్న పిల్లలకూ నిద్ర ఉండట్లేదు.. మంచిగా పడుకోవాలంటే పేరెంట్స్ ఈ టిప్స్ పాటించాలి!



ఒత్తిడి.. పెద్దల్నే కాదు, పిల్లల్నీ చిత్తు చేస్తున్నది. విద్యాపరమైన టార్గెట్లలో బాల్యం బందీ అవుతున్నది. ఇక డిజిటల్ గ్యాడ్జెట్ల వాడకం.. పిల్లల నిద్రా నాణ్యతను దెబ్బతీస్తున్నది. వాటిల్లోంచి వచ్చే బ్లూలైట్ వల్ల.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ సహజ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతున్నది. మొత్తంగా.. నేటితరం చిన్నారులకు కంటినిండా నిద్ర కరువైపోతున్నది. జీవనశైలిలో మార్పుల వల్ల ఈ సమస్య నుంచి బయట పడే అవకాశం ఉన్నది. కొంతమంది పిల్లలు.. ఇలా పడుకోగానే అలా నిద్రలోకి జారుకుంటారు. కొందరికి అస్సలు నిద్రపట్టదు. అలాంటి వారిని నిద్రపుచ్చడానికి తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, చిన్నారుల ఎదుగుదలలో ఆహారం తర్వాత నిద్రే కీలకమైంది. మెదడు వికాసానికీ నిద్ర దోహదం చేస్తుంది. కాబట్టి, పిల్లలకు కంటినిండా నిద్ర ఎంతో అవసరం. ఇందుకోసం పిల్లలకు ప్రత్యేక దినచర్యను అలవాటు చేయాలని చెబుతున్నారు నిపుణులు. కథల పుస్తకాలు చదవడం, చిన్నచిన్న వ్యాయామాలు, మృదువైన సంగీతం వినడం వంటివి పిల్లల మనసును ప్రశాంతపరుస్తాయి.

ఇక స్క్రీన్ టైమ్‌ను తగ్గించడం, పడుకునే ముందు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయడం.. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి. వారాంతాల్లోనూ ఒకే సమయానికి నిద్రలేచే అలవాటు.. నిద్ర చక్రాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇక పిల్లల్లో నిద్రను ప్రోత్సహించడానికి.. బెడ్‌రూమ్ చీకటిగా, నిశ్శబ్దంగా, చల్లగా ఉండేలా చూసుకోవాలి. మంచం సౌకర్యవంతంగా ఉండాలి. మనసుకు ప్రశాంతత చేకూర్చే పుస్తకాలు కూడా మంచి నిద్రకు ఆహ్వానం పలుకుతాయి. రాత్రి పడుకునే ముందు శరీరాన్ని సున్నితంగా స్ట్రెచ్ చేయడం, యోగా లాంటివీ.. నిద్రకు సహకరిస్తాయి. అయితే, ఇలాంటి దినచర్యలను పాటించడం కేవలం స్వల్పకాలిక పరిష్కారం కోసమే కాదు.

ఇది పిల్లల్లో భావోద్వేగ పరంగా, మానసికంగా సానుకూల మార్పు తీసుకొస్తుంది. స్థిరమైన, ప్రశాంతమైన దినచర్య.. పిల్లలకు స్వీయ నియంత్రణపై నైపుణ్యాన్ని నేర్పుతుంది. దీర్ఘకాలంలో పిల్లలు ఒత్తిడిని నిర్వహించడానికి సన్నద్ధమవుతారు. మెరుగైన భావోద్వేగాలను కలిగి ఉంటారు. మంచినిద్ర వేసే ఈ పునాది.. పిల్లల తరువాతి జీవితంలో మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని పలు సర్వేలూ చెబుతున్నాయి.

**ఎవరెవరికి ఎంతెంత?**

ఏడాదిలోపు పసిపిల్లలకు.. రోజుకు 12 నుంచి 16 గంటల నిద్ర అవసరం ఉంటుంది.

ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులు 11 నుంచి 14 గంటలు నిద్రపోవాలి.

మూడు నుంచి ఐదేళ్లలోపు వారికి .. రోజుకు 10 నుంచి 13 గంటలు నిద్రపోతే ఆరోగ్యం.

పాఠశాలకు వెళ్లే ఆరు నుంచి పన్నెండేళ్ల పిల్లలు రోజుకు 9 నుంచి 12 గంటలు నిద్రపోవాలి.

యుక్త వయసులోకి వచ్చిన వారు ప్రతిరోజూ 8 నుంచి 10 గంటల వరకు నిద్రించాలి.

మంచి నిద్ర రావాలంటే..

పిల్లలు మంచి నిద్రపోయేలా వారి వయసుకు తగ్గట్లుగా కొన్ని అలవాట్లు చేయాలి. పడుకునే ముందు పిల్లలు రిలాక్స్ కావాలి. 'బెడ్ రొటీన్స్'ను అలవాటు చేయాలి.

చిన్నారుల రాత్రి భోజనాన్ని త్వరగా ముగించాలి. అలాగే, రాత్రిపూట డిన్నర్ లైట్‌గా ఉండేలా చూసుకోవాలి.

రాత్రిపూట నిద్రపోవడానికి మారాం చేసే పిల్లలకు పెరుగన్నం, అరటిపండును తినిపిస్తే.. త్వరగా పడుకునే అవకాశం ఉంటుంది.

పడుకునే ముందు పిల్లలకు గోరువెచ్చని నీటితో స్నానం చేయిస్తే.. త్వరగా నిద్రపోతారు.

ఇంట్లో అందరూ ఒకే సమయానికి నిద్రపోతే.. వారితోపాటు పిల్లలూ నిద్రలోకి జారుకుంటారు.

సాయంత్రంపూట పిల్లలు ఔట్‌డోర్స్ గేమ్స్‌లో పాల్గొనేలా చూడాలి. దీనివల్ల వారి శరీరం అలిసిపోయి.. త్వరగా నిద్రపోవడానికి ఆస్కారం ఉంటుంది.

ప్రజా చైతన్యమే...
లక్ష్యం
తెలుగు దినపత్రిక
శనివారం 23 ఆగష్టు 2025

# ఆటో డ్రైవర్లు ఆందోళన




**గుంటూరు, తాడేపల్లి లక్ష్యం న్యూస్ :** తాడేపల్లిలో ఆటో డ్రైవర్ల ఆందోళన.... ఫ్రీ ఉచిత బస్సు పథకం తమ కొంప ముంచిందంటూ పెద్ద మొత్తంలో ఆటో డ్రైవర్లు నిరసన. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు కి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలనీ ఉ ండవల్లి సెంటర్లో ఆందోళన చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన 15 వేల హామీని రెండు సంవత్సరాల కలిపి 28 వేల రూపాయలు ప్రతి ఆటో కార్మికునికి చెల్లించాలనీ ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఉచిత బస్ వలన నష్టపోయే ప్రతి కార్మికులకి 5,000 రూపాయలు నెలల పెన్షన్ రూపంలో ఇవ్వాలి అని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీలో ఓలా, ఉబర్, రాపిడో వంటి కార్పొరేట్ సంస్థలను నిషేధించి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవో నెంబర్ 21 వెంటనే రద్దు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పదవులకే వన్నె తెచ్చిన పిచ్చిరెడ్డి...




**మంగళగిరి ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్) :** మంగళగిరి పెదకోనేరు వద్ద ఉన్న ది మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఇటీవల సంఘం చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన గాదె పిచ్చిరెడ్డిని శుక్రవారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరావు యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు దేశం నాయకులు కలిసి అభినందించారు. అనంతరం యాదవ్ మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావం నుంచి నాటి మాజీ మంత్రి ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు ముఖ్య అనుచరునిగా ఉంటూ, నియోజకవర్గంలో నాటి నుంచి నేటి వరకు పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న పిచ్చిరెడ్డిని పార్టీ గుర్తించి చైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ పార్టీలో సీనియర్స్ ను గుర్తించి పదవులు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో సొసైటీ చైర్మన్ గా చేసిన పిచ్చిరెడ్డి అనుభవం రైతాంగంకు అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పలు పదవులు నిర్వహించి పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి పిచ్చిరెడ్డి అని అన్నారు. రైతాంగం సమస్యలను రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి రైతు సంక్షేమం, అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింకా కోటేశ్వరరావు, దానబోయిన రామారావు, రుద్రు మురళి, దానబోయిన శివశంకరరావు, మద్దుల శ్రీకాంత్, కాపు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు గుడిపాటి చిన్న తిరుపతి నాయుడు, సీపీఎం నాయకులు కుర్రా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రుణాల పంపిణీ...



**మంగళగిరి ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్) :** మంగళగిరి చిన్న పంజా వీధిలోని జీడీసీసీ బ్యాంకు మంగళగిరి శాఖ కార్యాలయంలో ది మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు రుణాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా సంఘం చైర్మన్ గాదె పిచ్చిరెడ్డి హాజరై రైతులకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం పిచ్చిరెడ్డి మాట్లాడారు. సొసైటీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాలుగు రోజులకే రైతులకు రుణాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. 41 లక్షల ఇరవై ఒక్క వేల రూపాయలు రుణాలు రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులు రుణాలను సద్వినియోగం చేసుకొని పంట బాగా పండించి అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు అందే శివశంకరరావు, వాసా వేణు కుమార్, ఇన్చార్జి సీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా అన్నదానం





**మంగళగిరి ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్) :** మంగళగిరి పట్టణంలో పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ చిరంజీవి యువసేన అధ్యక్షులు వల్లంశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పాత మంగళగిరి శ్రీకృష్ణ చైతన్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వల్లంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడుతూ, ఆయన స్థాపించిన చిరంజీవి బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటి సేవా కార్యక్రమాలు అనేక ప్రాణాలను రక్షించాయని గుర్తు చేశారు. సమాజంలో పేద, నిరుపేదలకు సహాయం అందించడంలో చిరంజీవి చూపుతున్న కృషి ఆదర్శప్రాయమని వారు అభిప్రాయపడ్డారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులు కూడా అన్నదానం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, చిరంజీవి దీర్ఘాయుష్మంతుడై మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎంపీ ఎంసీ ప్రధాన కార్యదర్శి బాణాల నాగేశ్వరరావు, బల్ల శ్రీనివాస్ నాయుడు, కోరినపాటి శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాసరావు, కే డేవిడ్, సిహెచ్ గంగాధర్ రావు, సువర్ణగంటి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# సంచార అర్ద సంచార జతుల వారు అభివృద్ధికై ముందడుగులు వేయాలి..

◆ బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర సభ్యులు అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు..





**చిలకలూరిపేట ఆగస్టు 22 (లక్ష్యంన్యూస్) :** భారతదేశంలో బ్రిటీష్ దురహంకార పాలన నుండి విముక్తి కోసం,దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో ఎందరో పోరాట యోధులబలిదానాలు, ఆత్మర్పణలు, త్యాగాలు, పోరాటపటిమలును, బుర్రకథలు, తోలుబొమ్మలాటలు, గంగ్రిద్దుల ఆటలు, పాటలు, హరికథలు, డప్పు వాధ్యాలు, మొదలైన కళలతో నైతికత, జాతీయ సాంస్కృతిక తో వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలు ఊరు ఉరా సంచరిస్తూ దేశ ప్రజలకు వివిధ కళల రూపంలో ప్రదర్శిస్తూ... ప్రజలలో ఆనందాన్ని కలిగిస్తూ, స్వాతంత్ర పోరాట స్ఫూర్తిని నింపుతూ జాతీయత భావాలు పెంపొందిస్తూ స్వాతంత్ర పోరాట సమిధులై బ్రిటీష్ దురహంకార చర్యలకు గురి అయి బ్రిటీష్ వారి పాలనలో దేశద్రోహులు గా, నేరస్తులు గా ముద్రించబడి జైలు పాలయి అనేక విధాలుగా శిక్షిచబడిన జాతి ఈ సంచార, అర్ద సంచార జాతి.

యుద్ధ తంత్రాలలో నేర్పరులై రాచరికపు రాజ ప్రసాధాలలో యుద్ధ తంత్రాలు పై శిక్షణ నిచ్చు ఈ సంచార యోధులు , భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు సారదులైన ఈ జాతులు స్వాతంత్ర్య సముపార్జన తరువాత కూడా ఏ విధమైన ఆలనా, పాలన, అభివృద్ధికి నోచుకోకుండా నేటి భారతీయ సమాజంలో నేటికీ కూడా వివక్షతకు గురి ఆవుతూ అభివృదికి ఆమడ దూరం లో విసిరి వేయబడుతున్నారని,వాస్తవానికి ట్రైబల్ వర్గానికి చెంది ఎస్ టి జాబితాలో భారత దేశంలో నివసించావాల్సిన ఈ సంచార అర్ద సంచార జాతులను ఆనాటి పాలకులు బీసీ వర్గంలో కేటాయించి దేశ సంస్కృతీ సాంప్రదాయా లకు వారసులైన ఈ జాతులను నిర్లక్ష్యం చేసినారు, ఆ తరువాత కాలం లో కూడా దేశ పాలకులలో ఎవరు కూడా ఈ జాతుల వారి పై ఆలోచించలేదు. భారతీయ జనతా పార్టీ లో వాజ్ పాయ్ మొట్టమొదటి సారిగా ఈ జాతులపై ఆలోచించి, వీరి జనాభా సేకరణ చేపట్టించి, వీరి అభివృద్ధికి ప్రణాళికలు ఏర్పాటుకు అడుగులు వేశారు, వాజపాయ్ అనంతరం నరేంద్ర మోడీ ఈ జాతుల పై ప్రత్యేక శ్రద్ధతో వీరిని అత్యంత వెనుకబడిన బీసీ వర్గాలు గా ఏర్పాటు చేయించి బీసీ కమీషన్ ను కూడా ఏర్పాటు చేయించారు. అంతే కాకుండా కేంద్ర మంత్రి వర్గం లో కూడా బీసీ వర్గాలలో వివిధ కులాల వారీగా మంత్రి పదవులు కల్పించారు, జాతీయ స్థాయిలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్లు కల్పించారు. సీడ్ పథకం ఏర్పాటు చేయించి వీరికి ప్రత్యేకం గా నిధులు ఏర్పాటుచేసి రుణాలు ఇప్పించారు. బీసీ ల రాజ్యాధికార ఆకాంక్షలను నరేంద్ర మోడీ నెరవేరుస్తూ అభివృద్ధికి బాటలు వేస్తూ ప్రోత్సహిస్తున్నారు.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీన్ మాధవ్ వాజ్ పాయ్, మోడీ స్ఫూర్తి తో సంచార, అర్ధసంచార జాతులపై ప్రత్యేక శ్రద్ధతో వీరి అభివృద్ధికి, రాజ్యాధికారానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులుగోపి శ్రీనివాస్ నేత్రుత్వం లో సంచార, అర్ద సంచార జాతులను ఏకం చేయిస్తూ, వారిలో అభివృద్ధి మార్గాల పై అవగాహన కల్పిస్తూ, వారికి ఏమి కావాలో అడిగి తెలుసుకుంటూ, వారి అభివృద్ధికి, వారి రాజ్యాధికార ఆకాంక్షలు నెరవేర్చుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 ఆగష్టు 2025 న విజయవాడలో, ది వెన్యూ ఫంక్షన్ హాల్ వద్ద.. స్ఫూర్తి... అను నామంతో సంచార అర్ద సంచార జాతుల వారి వృత్తులైన... భారతీయ సంస్కృతి సాంప్రదాయాలైన వివిధ కళలు ప్రదర్శింపచేస్తూ వారికి రివ్వర్డులు , అవ్వార్డులు ప్రధానం చేయుటకు, సంచార అర్ద సంచార జాతుల వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ఈ స్ఫూర్తి సభను సంచార, అర్ద సంచార జాతులు, బీసీ వర్గాల వారు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరుతూ పీవీన్ మాధవ్ సంచార అర్ద జాతులను, బీసీ వర్గాలను స్ఫూర్తి అను ఈ అభివృద్ధి కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారని అన్నారు.

ఈ కార్యక్రమం గురించి సంచార అర్ద సంచార జాతులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తూ చిలకలూరిపేటలో.. ఎన్టీఆర్నగర్ లో ఉన్న సంచార జాతుల వారిని, మరియు కోంద్రు పాడు లో నివసిస్తున్న అర్ద సంచార జాతుల వారిని కలిసి వారికీ అవగాహన కల్పించి 30 వ తేదీ జరుగు స్ఫూర్తి సభకు ఆహ్వానించరు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం గురు స్వామి, అసెంబ్లీ కన్వీనర్ తాడిపర్తి జయరామిరెడ్డి, జిల్లా ఉ పాధ్యక్షులు మల్లెల శివ నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి గట్టా హేమ, పట్టణ మాజీ అధ్యక్షులు బ్రాహ్మం, బీజేవైఎం నాయకులు పులుగుజ్జు మహేష్, కోటేశ్వరావు, నాదెండ్ల మండల మాజీ అధ్యక్షులు శివకోటిరెడ్డి తది తరులు పాల్గొన్నారు.

# ఛలో ఒంగోలుకు తరలిరండి

## సిపిఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య





**మంగళగిరి ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్) :** ఈనెల 23న నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు నగరంలో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర మహా సభలకు సిపిఐ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి సిపిఐ పార్టీ కార్యాలయంలో (నీలం రాజశేఖర్ రెడ్డి భవన్లో ) విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు ఒంగోలు నగరంలో భారీ ప్రజా ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ప్రదర్శన,బహిరంగ సభకు ముఖ్యఅతిధులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శిలు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జి వి సత్యనారాయణ, పాటు పలువురు జాతీయ, రాష్ట్రనాయకత్వం హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో రాష్ట్ర మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర ధరలు తగ్గించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంచుతూ బిల్లు పట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి నేడు నెలకొందన్నారు. రాష్ట్రంలో అధికారంలోఉన్న చంద్రబాబు, ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్ రెడ్డిలు మోదీ విధానాలను ప్రశ్నించకపోవడం, కనీసం నోరుమెదిపే పరిస్థితి లేదని, ఈ స్థితిలో ప్రజల కోసం ప్రజా పోరాటలను మరింత విస్తృతం చేయాల్సిన బాధ్యత సీపీఐతో పాటు వామపక్షాలపై ఉందని అన్నారు. మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, శీలం శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో అక్రమ నిర్మాణాల తొలగింపు







**చిలకలూరిపేట ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్):** పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నరసరావుపేట సెంటర్ నుంచి బైపాస్ వరకు ఉన్న రోడ్డుపై అక్రమంగా నిర్మించిన దుకాణాలు, ఇతర నిర్మాణాలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ విభాగం నిర్ణయించింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఈ ఆక్రమణల తొలగింపు ప్రక్రియను చేపట్టాలని అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఆదేశాల మేరకు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ రోజు నరసరావుపేట సెంటర్లోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఆక్రమణలను తొలగించడం ప్రారంభించారు. ఈ చర్య వల్ల పాదచారులు, వాహనదారులు సురక్షితంగా ప్రయాణించేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని, పట్టణాన్ని మరింత సురక్షితంగా, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



**నరసరావుపేట ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్):** ఈరోజు జనసేన పార్టీ కార్యాలయంలో పద్మ భూషణ్ కొణిదెల శివ శంకర వరప్రసాద్ చిరంజీవి జన్మదిన వేడుకలు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, జన సైనికులు,వీర మహిళలు , చిరంజీవి అభిమానుల మధ్య ఘనంగా వేడుకలు నిర్వహించడం జరిగింది చిరంజీవి సీనియర్ అభిమాని షేక్ రసూల్ ని జనసేన పార్టీ నాయకులు మరియు వీర మహిళలు షాలువాలతో సత్కరించటం జరిగినది తెలుగు సినిమా రంగంలో చరిత్ర గర్వించదగ్గ మహా నటుడు చిన్న స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ స్వయంకృషితో ఆనాడు రెండు మూలా స్థంభాలైన వారితో నటనలో పోటీపడి నూతనమైన,ఫైట్స్,బ్రేక్,డిస్కో మైదలైన డాన్స్ ల తోటి వివిధ రకాల క్యాస్టూమ్స్,లతో కొన్ని సీన్లు డూప్ లేకుండా కుర్రకారుని ఏదుర్కోంటూ ఐదు దశాబ్దాలుగా నేటికీ మెగా స్టార్గా తన నటనా విశ్వరూపం తోటి విశ్వంభరుడిగా రేపు మన ముందుకు రాబోతున్న వెండితెర ఇలవేల్పు మా అన్నయ్య కొణిదెల కోదమసింహం కొణిదెల శివశంకర్ వర ప్రసాద్ (చిరంజీవి)నరసరావుపేట జనసేన పార్టీ తరుపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ రసూల్, అచ్చుల సాంబశివరావు ,షేక్ అద్రుఫ్,తిరుమలశెట్టి శ్రీనివాసరావు,దమ్మవలం కొండలు,కృష్ణంశెట్టి ఏడుకొండలు , చిందుకూరి శ్రీనివాసరావు, అప్పిశెట్టి లక్ష్మీనారాయణ, పసుపులేటి పార్థసారథి, అడపాల వెంకటేశ్వర్లు,తెడ్ల వెంకటేశ్వర్లు, షేక్ ఖాజావలి, షేక్ మహబూబ్ బాషా,గొట్టిపాటి శివ,మల్లెపూల దుర్గాకుమారి, అంబటి రేణుక,జక్కంనిర్మల,జడ్రశ్రావణి, క్రోసూరిమాధవి, యనమల కొండలు,మధు,గురజాల వాసు, ఆళ్ల శ్రీకాంతు, హనుమంత రావు, మిరియాల సోమ శంకర నాగ్,వనపర్తి విష్ణు, నక్క గోపి, నాగరాజు,బెల్లంకొండ సత్యనారాయణ,గోలి అంకారావు, అడపాల శ్రీనివాసరావు,అడపాల శేషు , ఆకుల శేషయ్య,బత్తుల దుర్గాప్రసాద్, రామిశెట్టి అనిల్ కుమార్,జూపల్లి కోటేశ్వరరావు, కొమ్మవరపు మల్లికార్జున రావు,దేవయ్య,ఢిల్లీ నాయుడు,పానాల నాగరాజు మొదలగువారు పాల్గొన్నారు.

# శానిటరీ కార్యాలయాన్ని సందర్శించిన : మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని





**చిలకలూరిపేట ఆగస్టు 22( లక్ష్యం న్యూస్) :** మున్సిపల్ కార్యాలయం రోడ్డు ప్రత్తిపాటి గార్డెన్ వద్దనున్న 1 వ డివిజన్ శానిటరీ కార్యాలయానికి శుక్రవారం నాడు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని సందర్శించారు. అక్కడ ఉన్న పారిశుద్ధ కార్మికులు,శానిటరీ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో పారిశుద్ధ కార్మికులు తమ విధులలో ఎదురవుతున్నప్పుడు సమస్యలను, అవసరాలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ విషయంపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పారిశుద్ధ కార్మికులు సిబ్బంది చెప్పిన సమస్యలను శాసనసభ్యులు మరియు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి, వాటిని పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. వారి సంక్షేమం కోసం మున్సిపల్ పాలకవర్గం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ సి. హెచ్.రమణారావు, మేస్త్రీలు తదితర సిబ్బంది ఉన్నారు.

# ప్రతి అడుగు ప్రజల కోసమే

- నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్):** నరసరావుపేట శాసన సభ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. శుక్రవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మరోసారి తన ప్రజాసేవా నిబద్ధతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో ని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఎమ్మెల్యేకు సమర్పించారు. గత వైసిపి ప్రభుత్వం వైఫల్యం కారణంగా ఈ నియోజకవర్గంలో రోడ్లు,విద్యుత్ సరఫరా, నీటి సమస్యలు,ఆరోగ్య సేవలు, మరియు రైతుల సమస్యలతో సహా అనేక సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ వేదిక ఒక ముఖ్య వేదికగా మారింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సుమారు 150-200 మంది ప్రజలు తమ ఫిర్యాదులతో హాజరయ్యారు. ఈ ఫిర్యాదులలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతు,తాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా అంతరాయాలు, మరియు ప్రభుత్వ పథకాల అమలులో ఆటంకాలు వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖ అధికారులతో ఫోన్ ద్వారా సంప్రదించి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు,ప్రజా సమస్యల పట్ల నిబద్ధత 2024 ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున విజయం సాధించిన డాక్టర్ చదలవాడ అరవింద బాబు అధికార పక్షంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారు. ఆయన నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఉదాహరణకు గత ఆరు నెలల్లో నియోజకవర్గంలో దాదాపు 100 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతు పనులు, 10 గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడం, మరియు 5 ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాల మెరుగుదల వంటి పనులు పూర్తయ్యాయి. డాక్టర్ చదలవాడ ప్రజా సమస్యల పరిష్కారంలో తన నిబద్ధతను కొనసాగిస్తూ వివాదాలకు దూరంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

# మట్టి గణపతిని పూజిద్దాం ! పర్యావరణాన్ని కాపాడుదాం !







**తెనాలి ఆగస్టు22 (లక్ష్యంన్యూస్) :** భారతీయ సంస్కృతి లో ప్రతి పండగకు ఓ ప్రత్యేకత ఉంటుంది. పూజా విధానంలో పండగ ప్రసాదాలలో శాస్త్రీయ దృక్పథం ఆరోగ్య రహస్యాలు ఉంటాయి అనేది సుస్పష్టం. మన పూర్వీకులు పర్యావరణ ప్రేమికులు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో ఏర్పాటు చేయబడింది వినాయక చవితి పండుగ. మన జీవన విధానంలో ఆయుర్వేదానికి కూడా ఒక ప్రత్యేక స్థానం ఉంది. నిత్య జీవితంలో మన ఆరోగ్యానికి ఉపయోగపడే ముఖ్యమైన ఔషధ లక్షణాలు గల మొక్కలను, పూలను గుర్తించి వాటితో మట్టి వినాయకుడిని పూజించే విధంగా మన పూర్వీకులు ఆచారాన్ని ఏర్పాటు చేశారు. వర్షాకాలం ముందు చెరువులు, గుంటలు, కాలువలు నీరు నిండుకోవడంతో అడుగున బురదతో కూడిన మట్టి మిగులుతుంది. దానిని బయటకు తీయడం వలన పూడిక తొలగి చెరువు లోతు పెరగడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. తీసిన మట్టితో విగ్రహాలు తయారు చేస్తారు. ఇంకా పంట పొలాలలో వేయడం ద్వారా వ్యవసాయ భూములు సారవంతం అవుతాయి. చెట్టుకొమ్మలు విరచి వేయడం ద్వారా చెట్టుకొమ్మలు కొత్త చిగురులతో ఏపుగా పెరుగుతాయి. వర్షాకాలం నీరు కలుషితం అవుతుంది. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు పెరగడం వలన క్రిమి కీటకాలు పెరుగుతాయి. వివిధ రకాల పత్రిలను సేకరించి రోజంతా ఇంట్లో ఉంచడం ద్వారా గాలిలోని సూక్ష్మజీవులు నశిస్తాయి. పూజించిన పత్రి బావులలో, చెరువులలో వేయడం వలన నీరు కూడా శుభ్రం అవుతుంది. పత్రి కొరకు ఆయా మొక్కలను గుర్తించి సంరక్షించడం కారణంగా మొక్కలకు సంరక్షణ ఉంటుంది. వాటిలోని ఔషధ గుణాలను గుర్తించడం ద్వారా మన ఆరోగ్య రక్షణకు కూడా ఆ మొక్కలను ఉపయోగించుకుంటాము. సాంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో వినాయకుని పూజించడానికి బదులు ఆడంబరంగాను, పర్యావరణ కాలుష్యం పెరిగే విధంగా ఉత్సవాలు జరుపుతున్నాము. నిమజ్జనం పేరుతో డీజే మ్యూజిక్ లతో శబ్ద కాలుష్యం కూడా పెరుగుతుంది. ప్రజల్లో ఇప్పుడిప్పుడే కొంత అవగాహన పెరగడం ద్వారా మట్టిగణపతిని ఏక్కువమంది పూజిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ద్వారా ఊరేగింపులు కొంతవరకు నియంత్రించబడుతున్నాయి. శాస్త్రీయంగా ఇంటిలో పూజించేవారు, బొటన వేలు పరిమాణంలో లేదా మూడు నుంచి తొమ్మిది అంగుళాల ఎత్తు మట్టి విగ్రహాలను పూజించాలి. సామూహిక పూజలను జరిపేవారు మూడు నుండి నాలుగున్నర అడుగుల ఎత్తు ఉండే మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలి. కానీ ఒకరితో ఒకరు పోటీపడి అడుగుల ఎత్తు పెంచుకుంటూ 70 అడుగుల వరకు విగ్రహాలను పెడుతున్నారు. నేడు సాంప్రదాయాలను మరచి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ లాంటి హానికర పదార్థాలతో రసాయనాలను వినియోగించడం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది కాలుష్యం పెరగడం ద్వారా జీవరాసులు, మనుషులలో ఆరోగ్య సమస్యలు పెరిగి జీవన ప్రమాణాలు తగ్గి మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. ప్రజల ఆధ్యాత్మిక భావన వ్యాప్తి చేయడానికి ప్రజల మధ్య పరస్పర సహకారం పెంపొందించుకోవడానికి వర్షాకాలంలో ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి వినాయక చవితిని మట్టి విగ్రహాలతో పూజ ఆచరించడం ద్వారా ప్రయోజనకరంగా ఉంటుంది. ఏళ్ల తరబడి ఈ విషయాలను ప్రచారం చేస్తూ చాలామంది ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ బాధ్యత తీసుకుని బాధ్యత గల పౌరునిగా వ్యవహరిద్దాం! మట్టి గణపతిని పూజిద్దాం! పర్యావరణాన్ని కాపాడుదాం!

# శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఘనంగా ఐదవ మరియు చివరి శ్రావణ శుక్రవారం వేడుకలు

**ఇంద్రకీలాద్రి, లక్ష్మి న్యూస్ :** విజయవాడ, ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఐదవ మరియు చివరి శ్రావణ శుక్రవారం వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ఈ పవిత్రమైన రోజున అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు మరియు సామూహిక ఉచిత కుంకుమార్చనలు ఇతర పూజా కార్యక్రమాలు దేవస్థానం అర్చకులు మరియు వైదిక కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ రోజు ఐదవ మరియు చివరి శ్రావణ శుక్రవారం కావటంతో విశేషంగా పెద్ద మొత్తంలో భక్తులు, ముఖ్యంగా మహిళలు, అమ్మవారి దర్శనం చూసుకొని తరించారు. ప్రత్యేక కుంకు మార్చనకు భక్తులు పెద్దోత్తంతో విచ్చేయడంతో దేవస్థానం అధికారులు రెండు బ్యాచ్‌లు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో, అత్యధిక సంఖ్యలో భక్తులు కుంకుమార్చనలో పాల్గొనేందుకు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా, దేవస్థానం రెండు ప్రత్యేక బ్యాచ్‌లలో కుంకుమార్చనలు నిర్వహించింది. మొదటి బ్యాచ్ ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు, రెండవ బ్యాచ్ ఉదయం 10 గంటల నుండి 11:30 గంటల వరకు జరిగాయి.

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఈ దేవస్థానంలో జరుగుతున్న పలు విశేషమైన కార్యక్రమాలను పర్యవేక్షణ బాధ్యతలను దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనానాయక్ దగ్గరండి చూసుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులకు తాగునీరు మరియు ఇతర సౌకర్యాలు కల్పించేలా సూచనలు చేశారు.

**ప్రసాద వితరణ**

దర్శనానంతరం పత్యేక క్యూ మార్గంలో 16 గంటలు పాటు భక్తులకు ఉచిత ప్రసాదం మరియు నిరంతర అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. శ్రావణ మాసంలో ముఖ్యంగా శుక్రవారాల్లో, అమ్మవారి దర్శనం వలన సౌభాగ్యం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ ప్రత్యేక కుంకుమార్చనలలో పాల్గొనడం ద్వారా వివాహంలో ఆలస్యం, ఉద్యోగ ప్రాప్తి, సంతాన భాగ్యం, మరియు మంచి ఆరోగ్యం వంటి కోరికలు నెరవేరుతాయని నమ్మకం అనీ ఆలయ పండితులు గణాపాటి తెలియపరిచారు .

# ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం, అవగాహన సదస్సు



**నాదెండ్ల ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్) :** ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం, అవగాహన సదస్సును పలనాడు జిల్లా ఉద్యాన శాఖ, గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి సహకారంతో నాదెండ్ల గ్రామంలో నిర్వహించడం జరిగినది. ఆయిల్ పామ్ అంటే నూనె పంట. మార్కెట్లో ఎప్పుడు డిమాండ్ ఉన్న పంట . ప్రతి సంవత్సరం ఒక లక్ష కోట్లు ఖర్చుపెట్టి విదేశాల నుండి 150 లక్షల టన్నుల వంట నూనెను దిగుమతి చేసుకుంటున్నారు. పామాయిల్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల నుండి కాపు మొదలై 30 సంవత్సరాల వరకు నిరంతరం దిగుబడితో నిరంతర ఆదాయము వస్తుంది . దీనిలో తెగుళ్లు చీడపీడలు ఇతర పంటలతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుంది . ఆయిల్ ఫామ్ పకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు. అలాగే కోతులు అడవి పందులు బెడద ఉండదన్నారు. నేరుగా రైతుల నుండి కంపెనీవారు రైతులు పండించిన ఆయిల్ ఫామ్ గెలలను కొనుగోలు చేస్తారు . ఇతర పంటలతో పోలిస్తే ఖర్చు పోను ఎకరాకు నికరంగా ఒక లక్ష రూపాయలు పైగా ఆదాయం మిగులుతుంది. జిల్లా ఉద్యాన అధికారి ఐ వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది మండలాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తుంరని గుర్తించడం జరిగిందిని దీనిలో భాగంగా నాదెండ్ల గ్రామంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ లో భాగంగా 5 ఎకరాలు ప్లాంటేషన్ చేయడం జరిగిందన్నారు అలాగే ఆయిల్ ఫామ్ సాగు మరియు రాయితీ గురించి వివరించరు. ఆయిల్ ఫామ్ మొక్కలు ఖరీదు పై 100% రాయితీతో ఒక హెక్టార్ కి 150 మొక్కలు చొప్పున విదేశీ మొక్కలకు 193 రూపాయలు దేశీ మొక్కలైతే 133 రూపాయిలు చొప్పున 29వేల రూపాయలు రాయితీ ఇవ్వడం జరుగుతుందని సాగు ప్రోత్సాహంలో భాగంగా హెక్టార్ కు 50% రాయితీపై నాలుగు సంవత్సరాలుగాను 21000 మించకుండా రాయితీ ఇవ్వబడుతుందన్నారు .అలాగే అంతర పంట సాగుకు నాలుగు సంవత్సరాలుగాను 21000 రాయితీ ఇవ్వబడునని, బిందు సేద్యం ద్వారా కూడా ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు నియమ నిబంధన ప్రకారము ఆయిల్ ఫామ్ సాగు చేసుకున్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పెట్టుకోవాలని సూచించారు. రైతులు ఖచ్చితంగా నీటి సదుపాయం ఉండి, బోర్వెల్ సదుపాయం ఉండి , ఎండ్ల కాలంలో కూడా నీరు ఉండేటట్లు అయితే రైతులు. ఆయిల్ పామ్ సాగు చేసుకోవాల్సిందిగా కోరారు . పంట యొక్క మెలుకువలు మరియు యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు . ఈ కార్యక్రమములో ఉద్యాన శాఖ ద్వారా అమలు కాబడుతున్న పథకాలు వాటి రాయితీ వివరాలు గురించి రైతులకు వివరించడం జరిగింది . ఈ కార్యక్రమంలో నాదెండ్ల పిఎసిఎస్ అధ్యక్షులు నలమోతు హరిబాబు ,ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఐ వెంకట్రావు, గోద్రెజ్ కంపెనీ డీజీఎ శ్యామ్ , చిలకలూరిపేట ఉద్యాన శాఖ అధికారి శ్రీ లక్ష్మి, నాదెండ్ల మండల ఆర్ ఎస్ కె సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మహంకాళి అమ్మవారికి వెండి పళ్లెం సమర్పించిన భక్తులు



**తెనాలి ఆగస్ట్22(లక్ష్యంన్యూస్) :** భక్తులపాలిట కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే తల్లిగా భాసిల్లుతున్న కంఠం రాజు కొండూరు మహంకాళి అమ్మవారి దేవస్థానంకు లక్ష యాభై వేల రూపాయలు విలువచేసే కేజిన్నర వెండి పళ్లాన్ని కానుకగా అందజేశారు. తెనాలి బాలాజీ రావు పేటకు చెందిన భక్తులు భక్తి ప్రపత్తులతో వెండి పళ్లెం కానుకను అర్చకులకు అందజేశారు. స్థానిక బాలాజీ రావు పేటకు చెందిన బొందలపాటి శ్రీకాంత్, గీత, రజినీకాంత్ చౌదరి, అనూష, శివ కుమార్, జశ్విత చౌదరి ,గవిని శ్రీకృష్ణదేవరాయలు దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళి అమ్మవారికి కానుకగా కేజిన్నర బరువు గల వెండి పళ్లాన్ని దేవస్థాన అర్చకులకు అందజేశారు. అనంతరం మహంకాళి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు తమకు ఎప్పుడు ఉండాలని వారు ఈ సందర్భంగా వేడుకున్నారు.

# ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు




**తెనాలి ఆగస్ట్ 22 (లక్ష్యం న్యూస్) :** స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు వేడుకలను జనసేన పార్టీ నాయకులు చిరంజీవి ఫ్యాన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెనాలి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి తన 50 సంవత్సరాల సినీ జీవితంలో ఎంతో కష్టపడి అభివృద్ధిలోకి వచ్చారని అన్నారు. ఎవరి అండదండలు లేకుండా తనదైన శైలిలో పోటీని ఎదుర్కొని ప్రపంచవ్యాప్తంగా అభిమానులని సంపాదించుకున్నారని అన్నారు. మెగాస్టార్ అందించే సేవా కార్యక్రమాలను యువత ఆదర్శంగా తీసుకుని మంచి కార్యక్రమాలు చేయాలని వెంకట రమణారావు కోరారు. పార్టీ నాయకులు, చిరంజీవి అభిమాని గ్యాలం వేణు మాట్లాడుతూ తాము చిన్నప్పటి నుంచి మెగాస్టార్ చిరంజీవి అభిమానులమని చెప్పారు. అలాగే మెగాస్టార్ అందించే అనేక సేవా కార్యక్రమాలను తాము కూడా ముందుకు తీసుకు వెళ్లేవారమని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొని మెగాస్టార్ చిరంజీవి సమాజానికి అందించిన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో హరిదాసు గౌరీశంకర్, ఇస్మాయిల్ బేగ్ తదితర నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు పోషకాహారం కిట్లు పంపిణీ



**తెనాలి రూరల్ ఆగస్టు 22(లక్ష్యం న్యూస్) :** మండలంలోని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రము లో శుక్రవారం పి.యం.ఎస్.యం.ఎ. కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమములో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్రవిజయలక్ష్మి పాల్గొని గర్భవతులు తీసుకోవలసిన తగు జాగ్రత్తలు, పౌష్టికాహారము తీసుకొనుటవలన ఉపయోగాలు. కిల్కారి కాల్ లు వినాలని, కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో కాన్పులు జరగాలని సూచించారు.

గర్భవతులుకు ఆరోగ్య పరీక్షలు చేసారు. గ్రామంలో రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ నీరద, 60మంది గర్భవతులకు తమ సొంత నిధులతో పౌష్టికాహారం కిట్ అందచేయుట జరిగినది. ఈ కార్యక్రమములో డిప్యూటీ డీఎం హెచ్ ఓ డాక్టర్ ఈరుగులఅన్నపూర్ణ ,జిల్లావ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ చెన్నకేశవవెంకటసుబ్బారావు, డాక్టర్ యు దిలీప్, సూపర్వైజర్స్ వావిలాల సీతారామశాస్త్రి, ఏఎన్ఎంలు, యం. యల్ . హెచ్ పి లు,ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా పోలాల అమావాస్య



**తాడికొండ, ఆగస్టు22 (లక్ష్యం) :** మండల కేంద్రమైన తాడికొండ శివాలయం వీధి నందు గల తాడికొండ భవాని పీఠం ఆధ్వర్యంలో సుదీర్ఘకాలంగా జరుగుతున్న పోలాల అమావాస్య శుక్రవారం స్థానిక బీసీ కాలనీలోని రామాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, మండపార్చన,కలిశ స్థాపన,శ్రీ పోలేరమ్మ వారికి విశేష పుష్ప కుంకుమార్చన,వ్రత కథ ఆశీర్వచనం,నీరాజన మంత్రపుష్పం,తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో భవాని పీఠ వ్యవస్థాపకులు కొల్లిపర నాగ కోటేశ్వర శర్మ,భవాని పీఠ సభ్యులు ఊటుకూరి గోపి, వెంకటేశ్వర్లు,చెన్నమ్మ,శివ నాగేశ్వరరావు,సామ్రాజ్యం,ప్రముఖ వ్యాపారవేత్త తాడికొండకు చెందిన బుజ్జి బాబు,ధర్మపత్ని భాగ్యలక్ష్మి,కుమారుడు శ్రీ శ్రీమతి భరత్ కుమార్,భవాని పీఠ పోషకులు విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సాయంకాలం బిసి కాలనీ నందు శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఊరేగింపు మహోత్సవం ఘనంగా జరిగింది.

ప్రజా చైతన్యమే...
లక్ష్యం
తెలుగు దినపత్రిక
శనివారం 23 ఆగస్టు 2025



## వయసును మరిపించి.. దీర్ఘాయువుకు బాటలు పరిచి..!

శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, పోషకాల గనిగా పేరొందిన మష్రూమ్స్ ఆరోగ్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. మష్రూమ్స్‌లో ఔషధ గుణాలు పుష్కలంగా లభిస్తుండటంతో ఇవి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ఆహారంగా పేరొందాయి. వయసు మీదపడటం ద్వారా వచ్చే లక్షణాలను దీటుగా నిలువరించి వృద్ధాప్యాన్ని జాప్యం చేయడంలో మష్రూమ్స్ కీలకంగా పనిచేస్తాయని చెబుతున్నారు.ఏజింగ్‌కు అడ్డుకట్ట వేసి ఆరోగ్యానికి మేలు చేకూర్చే యాంటీఆక్సిడెంట్స్ వీటిలో లభిస్తాయి. వీటిని తరచూ తీసుకుంటే దీర్ఘాయువు చేకూరడంతో పాటు ఆరోగ్యంగా వయసు మీరే ప్రక్రియకు తోడ్పాటు అందిస్తాయి. రీషీ మష్రూమ్స్ అనే వెరైటీ పుట్టగొడుగులు ఆరోగ్యం, దీర్ఘాయువును అందిస్తుంది. అందుకే వీటిని దశాబ్ధాలుగా చైనా వైద్య ప్రక్రియల్లో వినియోగిస్తున్నారు.మష్రూమ్స్‌లో దీర్ఘాయువును ప్రేరేపించే ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని, వాపు ప్రక్రియను నివారిస్తాయని 2021లో న్యూట్రిషన్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన వెల్లడించింది. మష్రూమ్స్ బీపీని తగ్గించడంతో పాటు మధుమేహ నియంత్రణ, కొవ్వును తగ్గించడం, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ప్రేవుల ఆరోగ్యాన్ని కాపాడటం వంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలకు ఉపకరిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# హైడ్రేట్ అవ్వండి..



మనిషి శరీరంలో మూడింట్లో రెండు భాగాలు నీరే ఉంటుంది. ఇది తెలియని విషయం కాకపోయినా,చాలాసార్లు మర్చిపోయి నీళ్లు తాగడం తగ్గిస్తారు. దాంతో శరీరంలో నీటి శాతం తగ్గి రకరకాల సమస్యలు వస్తాయి. ఎండాకాలం అయినా, వానాకాలం అయినా.. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం చాలా అవసరం. హైడ్రేషన్ అంటే శరీరంలో ద్రవాల స్థాయిలను సరిగ్గా ఉంచుకోవడం. హైడ్రేషన్ ఆరోగ్యాన్ని కాపాడితే, డీహైడ్రేషన్ మనిషిని అన్నివిధాలా కుంగదీస్తుంది.

**ఇవీ ప్రయోజనాలు**

బాడీ హైడ్రేటెడ్‌గా ఉంటే%% శరీరంలో పోషకాల రవాణా, వ్యర్థాల తొలగింపు, జాయింట్ లూబ్రికేషన్, ఉష్ణోగ్రత నియంత్రణ వంటివి సక్రమంగా జరుగుతాయి.

హైడ్రేషన్ వల్ల ఆహారం సరిగ్గా జీర్ణమవ్వడంతో పాటు మలబద్ధకం సమస్యే రాదు. గ్యాస్, ఛాతీలో మంట లాంటివి దరి చేరవు.

శరీరంలో నీటిస్థాయులు తగ్గితే, మెదడు పనితీరులో మార్పులు వస్తాయి. మతిమరుపు, మానసిక ఆందోళ పెరుగుతాయి.

శరీరంలో నీటి శాతం బాగుంటే, గుండె కొట్టుకునే వేగం నియంత్రణలో ఉంటుంది. అలాగే గుండె నుంచి రక్త ప్రసరణను బాగా జరుగుతుంది.

హైడ్రేషన్ చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తూ, ఎలర్జీలను దూరం చేస్తుంది.

నీళ్లు సరిపడా తాగితే, అధిక బరువు సమస్య ఉండదు. బరువు తగ్గాలనుకునే వాళ్లు ఎప్పుడు శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి.

హాయగా ఉండండి..



**ఎప్పుడు ఏం చేయాలి?**

రోజు పొడవునా సరిపడా నీళ్లు తాగుతూనే ఉండాలి.

మూడుపూటలా నీటిశాతం ఎక్కువ ఉండే పండ్లు, కూరగాయాలు తీసుకోవాలి.

వ్యాయామం చేసినప్పుడు, వేడి వాతావరణంలో ఉన్నప్పుడు శరీరంలో నీటిస్థాయిలు తగ్గిపోతాయి. అలాంటప్పుడు మామూలు కంటే ఎక్కువ నీళ్లు తాగాలి.

**ఎవరు ఎంత తాగాలి?**

ఒక్కొక్కరికి ఒక్కోలా నీటి అవసరం ఉంటుంది. వాతావరణం, ఆరోగ్యం, శారీరక శ్రమను బట్టి ఒక్కొక్క శరీరాన్ని ఒక్కోలా హైడ్రేట్ చేయాలి. అలాగే స్త్రీ, పురుషుల్లోనూ నీటి అవసరం వేరుగా ఉంటుంది.

పురుషులు: రోజుకు దాదాపు 3.7 లీటర్ల (పదిహేనున్నర కప్పులు) నీళ్లు తీసుకోవాలి.

మహిళలు: రోజుకు దాదాపు 2.7 లీటర్ల (పదకొండున్నర కప్పులు) నీళ్లు తాగాలి.

**డీహైడ్రేషన్ లక్షణాలు**

శరీరంలో నీటి స్థాయులు పడిపోయినప్పుడు వివిధ అనారోగ్య సమస్యలు పలకరిస్తాయి. ఆయా లక్షణాలు గుర్తించి వెంటనే నీళ్లు తాగాల్సి ఉంటుంది. దాహం వేయడం, నోరు, చర్మం తడారిపోవడం, తలనొప్పి, కళ్లు తిరగడం, ఏకాగ్రత లోపించడం, నోటి దుర్వాసన

**ఇవి పాటించండి**

ఎక్కడికి వెళ్లినా వెంట ఒక నీళ్ల బాటిల్ పెట్టుకుని, కొన్నికొన్ని తాగుతుండాలి.

దాహం వేసేవరకు ఆగకుండా అప్పుడప్పుడు నీళ్లు తాగాలి.ఉదయం లేవగానే, అలాగే రాత్రి నిద్రపోయే ముందూ మంచినీళ్లు తాగాలి.వాతావరణ ఉష్ణోగ్రతలను బట్టి తాగే నీటి శాతాన్ని పెంచుకోవాలి. అలాగని చలికాలంలో నీళ్లు తాగడం తగ్గించొద్దు.

వ్యాయామం, క్రీడల్లో చురుగ్గా ఉండేవాళ్లు, ఎలక్ట్రోలైట్స్ గల డ్రింక్స్ తాగడం మంచిది.

# కొవ్వు కరిగేందుకు ఏడు చిట్కాలు

మన శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించుకునేందుకు మొదటగా అందరూ ఎంచుకునే మార్గం రన్నింగ్. లేదంటే జిమ్‌లో కసరత్తులు చేయడం. అయితే మనకు బాగా తెలిసిన ఇవి మాత్రమే కాదు, మరికొన్ని చిట్కాలు మన శరీరాన్ని ప్రతిరోజూ కొవ్వును కరిగించే యంత్రంగా మారుస్తాయి. అవేంటంటే..

**7-9 గంటల నిద్ర:** సరిపడా నిద్రలేకపోవడం వల్ల మన జీవక్రియ 20-30శాతానికి తగ్గిపోతుంది. దాంతోపాటు కొవ్వును నిల్వచేసే హార్మోన్లు పెరిగిపోతాయి. అందుకే కండరాలు బలంగా మారేందుకు, కొవ్వు పేరుకుపోకుండా ఉండేందుకు ప్రతిరోజు 7 నుంచి 9 గంటల నిద్ర తప్పనిసరి.

**8వేల అడుగులు:** ప్రతిరోజు 8000 అడుగులు ప్రశాంతంగా నడవడం వల్ల ఒత్తిడి లేకుండానే కొవ్వు కరుగుతుంది. అంటే ఈ నడకలో మరీ వేగం అక్కర్లేదన్నమాట.

**3-4 సార్లు వెయిట్ ట్రైనింగ్:** కండరాలు బలంగా ఉండేందుకు వారంలో 3-4సార్లు వెయిట్ ట్రైనింగ్ చేయడం వల్ల మనం విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు కూడా కేలరీలు ఖర్చువుతాయి. ఇది జీవక్రియకు ప్రయోజనాన్ని చేకూరుస్తుంది.





**ప్రొటీన్ ఫుడ్:** మనం ప్రతిరోజు ప్రొటీన్లు అధికంగా ఉండే భోజనాన్ని తీసుకోవాలి.ప్రొటీన్లలో30శాతం కేలరీలుజీవక్రియలోనే ఖర్చువుతా యి. ఇవ్వి కొవ్వును కరిగించేందుకు ఉపయోగకరంగా ఉంటాయి.

**నీళ్లు తాగండి:** భోజనం చేసేముందు నీళ్లు తాగడం వల్ల జీవక్రియ 30శాతం పెరుగుతుంది. దీనివల్ల అతిగా తినకుండా ఆకలి అదుపులో ఉంటుంది.

**ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్:** పది గంటల కాల వ్యవధిలో భోజనాలను పూర్తి చేయడం వల్ల శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. దీనివల్ల కొవ్వు ఆక్సీకరణం జరిగి రోజంతా శక్తి సమతులంగా ఉంటుంది.

**చల్లటి నీటితో స్నానం:** చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల శరీరంలో బ్రౌన్ ఫ్యాట్ యాక్టివేట్ అవుతుంది. ఫలితంగా కొన్ని గంటల పాటు కేలరీలు కరుగుతాయి.

# సైనసైటిస్‌కు స్వస్తి




వాన చినుకులకు కొందరు మురిసిపోతారు. కానీ మరికొందరు భయపడతారు. వర్షంలో తడిస్తే ఆరోగ్య సమస్యలు ఎక్కడ వస్తాయోనని వారి బాధ. చలికి.. చల్లగాలికి.. వర్షానికి అలా వేధించే సమస్యే సైనసైటిస్. చూడడానికి చిన్న సమస్యగానే కనిపించినా ఇది ప్రమాదకరమైంది. దీనినెలా గుర్తించాలి? చికిత్స ఏంటి? తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? తెలుసుకొని సైనస్‌కు స్వస్తి పలుకుదాం.ఆధునిక జీవనశైలి సైనసైటిస్ సమస్యను తీవ్రతరం చేస్తున్నది. ప్రతి పదిమందిలో ఐదుగురు సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి లోపించడం కూడా దీనికి కారణం అవుతున్నది. వాతావరణంలో మార్పులు వస్తే కొందరు ఎక్కడ తమకు సైనసైటిస్ సమస్య వస్తుందేమోనని భయపడుతున్నారని చెప్తున్నారు సౌత్ కొరియాలోని యూనివర్సిటీ ఆఫ్ ఉల్సాన్ నిపుణులు. జీవనశైలి మార్చుకుంటే ఈ సమస్యను ప్రారంభంలోనే అధిగమించవచ్చు అని చెప్తున్నారు.



సైనసైటిస్ అంటే?: కపాలంలో గాలితో నిండిన కుహరాన్ని సైనస్ అంటారు. మ్యూకస్ మెంబ్రేన్ అనే మెత్తటి పొరతో సైనస్ కప్పబడి పలుచటి ద్రవపదార్థాన్ని తయారుచేస్తుంది. ఇది మనం ఊపిరి పీల్చినప్పుడు శరీరంలోకి ప్రవేశించిన గాలికి సరైన ఉష్ణోగ్రత, తేమ కల్పిస్తుంది. కపాలంలోని ఎముకల్లో గాలి ఉండడం వల్ల వాటి బరువు తగ్గించడంలో క్రియాశీలకంగా పనిచేస్తుంది. అంతేకాదు.. మనం మాట్లాడినప్పుడు శబ్దం రావడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. కొన్నిసార్లు ఎలాంటి పొర అడ్డులేకుండా సైనస్ నేరుగా ముక్కు రంధ్రంలోకి తెరుచుకుంటుంది. ఆ సమయంలో స్రవించిన స్రావాలు వాటి మార్గంలో అడ్డుపడటం వల్ల శ్వాస సమస్యలు ఏర్పడుతాయి. దీనినే సైనసైటిస్ అంటారు.

**లక్షణాలు** : తలనొప్పి, ముక్కు దిబ్బడ, నీరు కారడం, దగ్గు, జలుబు సైనసైటిస్ లక్షణాలు. వాతావరణం మారినప్పుడల్లా వైరస్, బాక్టీరియా, ఇన్ఫెక్షన్ల వల్ల సైనసైటిస్ వస్తుంటుంది.

ఎన్ని రకాలు? : సింపుల్‌గా చెప్పాలంటే కళ్లు, ముక్కు, పక్కభాగం ఎముకల్లో ఉండే సన్నని గాలితో నిండిన సైనస్ భాగం ఇన్ఫెక్షన్లతో వాచిపోవడాన్ని సైనసైటిస్ అంటారు. దీనిలో ఫ్రాంటల్, పారానాసల్, ఎత్మాయిటల్, మ్యాగ్జిలరీ, స్ఫినాయిడల్ వంటి రకాలు ఉన్నాయి. కానీ ముఖ్యంగా వీటిని మూడు రకాలుగా చెప్తారు. ఒక్కో దశలో ఒక్కో రకమైన తీవ్రతతో ఉంటుంది.

1. అక్యూట్ సైనసైటిస్
2. సబ్ అక్యూట్ సైనసైటిస్
3. క్రానిక్ సైనసైటిస్

అక్యూట్ సైనసైటిస్ వారం రోజులుంటుంది. సబ్ అక్యూట్ 4-8 వారాలుంటుంది. క్రానిక్‌ను దీర్ఘకాలిక సైనసైటిస్ అంటారు. ఇది 8-10 వారాలు బాధిస్తుంది. ఇండియాలో కన్నా అమెరికాలో సైనసైటిస్ సమస్యలు ఎక్కువ అని సర్వేలు చెప్తున్నాయి. 2.4 లక్షల మంది అమెరికన్లు సైనసైటిస్‌తో బాధపడుతున్నారట. వ్యాధిని తేలికగా తీసుకోవడమే వ్యాధి తీవ్రతకు కారణంగా చెప్పుకోవచ్చు. ఆపరేషన్ చేసినా కూడా సరైన జీవనశైలి లేకపోతే ఈ సమస్య మళ్లీ వచ్చే ప్రమాదం ఉంది.

ఎలాంటి సమస్యలు?: సైనసైటిస్ వల్ల సైనస్ భాగంలో తీవ్రమైన ఒత్తిడి, నొప్పి కలుగుతాయి. చీముతో కూడిన స్రావాలు ముక్కు నుంచి బయటకు వస్తాయి. ముక్కు దిబ్బడగా ఉంటుంది. ముక్కులో ఇన్ఫెక్షన్లు మొదలవుతాయి. కొన్నిసార్లు సూక్ష్మజీవులు ఎక్కువగా ఉన్న నీళ్లలో ఈత కొట్టడం వల్ల అవి సైనస్‌లోకి ప్రవేశించి వ్యాధిని కలిగిస్తాయి. స్విమ్మింగ్ పూల్స్‌లో క్లోరిన్ ఎక్కువగా ఉంటే కూడా ఆ గాలి ముక్కు రంధ్రాల ద్వారా సైనస్‌లోకి చేరి మ్యూకస్ మెంబ్రేన్ వాచిపోతుంది. దంతాలలో వచ్చే ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా సైనస్ సమస్యలు వస్తాయి. దీర్ఘకాలికంగా సైనసైటిస్ వ్యాధితో బాధపడే వారు కనురెప్పల వాపు, కనుగుడ్లు పక్కకు జరిగి ఉండటం, కన్ను నరం దెబ్బతిన్నపుడు చూపు కోల్పోవడం, వాసన తెలియక పోవడం, తరచూ జ్వరం రావడం, ఎదుగుదల లోపాలు వంటి సమస్యలు వస్తాయి.

ఇతర సమస్యలూ కారణమే: వేరే ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే వాటి వల్ల కూడా సైనసైటిస్ సోకుతుంది. పుష్టికరమైన ఆహారం తీసుకోకపోవడం, చికెన్ పాక్స్, కోరింత దగ్గు, డయాబెటీస్ సమస్యలు ఉన్నట్లయితే సైనసైటిస్ వస్తుంది. చాలా కేసుల్లో సైనసైటిస్ వైరల్ ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. తర్వాత బాక్టీరియా చేరి సైనస్ సమస్యగా మారుతుంది. ఈ హానికర సూక్ష్మజీవుల్లో స్ట్రెప్టోకోకస్ న్యుమోనియా, హీమోఫిలస్ ఇన్‌ఫ్లూయెంజా, స్టెఫైలోకోకస్ ఆర్‌ఈయస్ వంటి వాటివల్ల కూడా సైనసైటిస్ సమస్య వస్తుంది. మ్యూకోసల్ మెంబ్రేన్, సైనస్ ఎముకల మీద కూడా ప్రభావం వల్ల.. దంతాలకు ఉన్న అంటు సైనస్‌లకు వ్యాపించడం వల్ల సైనసైటిస్ సమస్య వస్తుంది.వ్యాధి నిర్ధారణ: ముఖం భారంగా ఉండటం, తలనొప్పి, గొంతులోకి ద్రవం కారటం, చెవిలో చీము పట్టడం, కోపం, మానసిక స్థైర్యం కోల్పోవటం, అలసట, విసుగు, పనిపై శ్రద్ధ లేకపోవటం వంటి లక్షణాలు వరుస క్రమంలో ఉంటే సైనసైటిస్‌గా గుర్తించాలి. దీనిని సీటీ స్కానింగ్, ఎక్స్‌రే ద్వారా నిర్ధారిస్తారు.

**కారణమేంటి?**

సైనస్‌లో సరైన వెంటిలేషన్ లేకపోవడం ముఖ్య కారణం. సాధారణంగా సైనస్‌లో మ్యూకస్ ద్రవాలు సీలియరీ మూమెంట్ వల్ల ఆస్టియాను చేరి అక్కడ నుంచి ముక్కు రంధ్రాల్లోకి చేరుతాయి. ఇది జరుగకుండా సైనస్‌లో తయారయ్యే పదార్థాలు నిల్వ ఉండి విధులకు ఆటంకం కలిగిస్తాయి. ముఖ్యంగా నాసికా కవచం, స్ఫుటం నిర్మాణంలో తేడాలు ఏర్పడతాయి. కొందరికి ముక్కులోని ద్రవాల చిక్కదనం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. ఒకసారి సైనసైటిస్ వచ్చి మ్యూకోసా దెబ్బతింటే పదే పదే వచ్చే అవకాశాలు ఉన్నాయి. వాతావరణం తేమగా, చల్లగా ఉన్నప్పుడు వాటి ప్రభావం వల్ల సైనసైటిస్ వస్తుంది.

**చికిత్స:** అమాక్సిసిల్లిన్ లేదా ఆంపిసిల్లీన్ మందులు ఇవ్వవచ్చు. ఓరల్ డ్రిక్సోరాల్, డిమెటాప్ మందులతో కూడా తగ్గుతుంది. స్టీమ్‌ను పీల్చుకొనుట ద్వారా హీట్‌ను కలిగించుట ద్వారా ముక్కు నుంచి స్రావాలు బయటకు రప్పించి ఉపశమనం కలిగించవచ్చు. నాసల్ స్ప్రేలు కొంతవరకు ఉపశమనాన్ని కలిగిస్తాయి. మందులకు తగ్గకపోతే మాత్రం శస్త్రచికిత్స ద్వారా సైనస్‌కు కారణమైన దుర్మాంసాన్ని తొలగించవచ్చు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- ఎలర్జీ కలిగించే వస్తువులను దూరంగా ఉంచాలి.
- తగిన పోషకాహారం తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవాలి.
- శ్వాసకోశ అంటువ్యాధులతో బాధపడుతూ ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి.
- శ్వాసకోశ వెలుపలి భాగాల్లో అంటు 7- 10 రోజుల కంటే ఎక్కువ ఉండకుండా చూసుకోవాలి.
- ముక్కు నుండి వచ్చే స్రావాల రంగు మారినా లేదా చెడు వాసన వస్తున్నా డాక్టర్‌ను సంప్రదించాలి.
- టాన్సిలైటిస్‌తో బాదపడుతున్నవారు వెంటనే ఈఎన్‌టీ నిపుణులను సంప్రదించాలి.

# జన్యు సమస్యలపై పోరాటం



షాలిని కేడియా.. ముంబైకి చెందిన ఆరోగ్య ఉద్యమకారిణి. ఫ్రాజల్ ఎక్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకురాలు. తనో ఏకవ్యక్తి సైన్యం. నివాస సముదాయాల దగ్గరికి వెళ్లి.. మైకు పట్టుకుని నిలబడతారు. తాను చెప్పే మాటలు ఆలకించమని అభ్యర్థిస్తారు. 'ఎవరికి తెలుసు? మూడున్నర వేలమందిలో మీ బాబు ఒకడు కావచ్చు. నాలుగువేల మందిలో మీ పాప ఒకరు కావచ్చు. ఫ్రాజల్ ఎక్స్ సిండ్రోమ్ ఎవరినైనా బాధించొచ్చు. ఆ లక్షణాలు తెలిస్తే.. చికిత్స సులభమే' అని మొదలుపెడతారు. అప్పటికే జనం గుమిగూడి ఉంటారు. చిట్టచివరి వ్యక్తి సందేహాన్ని కూడా తీర్చేశాకే అక్కడి నుంచి కదులుతారు షాలిని. ఆన్‌లైన్‌లోనూ ఆమె చురుగ్గా ఉంటారు. ప్రతి సామాజిక మాధ్యమాన్నీ సద్వినియోగం చేసుకుంటారు. ప్రెగ్నెన్సీ సమయంలో డీఎన్ఏ పరీక్ష చేయించడం ద్వారా ఫ్రాజల్ ఎక్స్ సిండ్రోమ్ బయటపడుతుంది. ఇదో జన్యుపరమైన రుగ్మత. దీనివల్ల పిల్లల్లో మానసిక ఎదుగుదల లోపిస్తుంది. ముద్దముద్దగా మాట్లాడతారు. బెరుకు బెరుకుగా ఉంటారు. ఇట్టే కోపం, ఏడుపు వచ్చేస్తాయి. తానే స్వయంగా ఓ పన్నెండువేల మందికి పరీక్షలు చేయించారు శాలిని. ముప్పై రెండు సంవత్సరాల క్రితం శాస్త్రవేత్తలు ఈ జన్యు సమస్యను గుర్తించారు.

# చాంపియన్ సావిత్రి



ఆమె మైదానంలో కాలుపెడితే.. మూడు క్రీడల చాంపియన్. ఒడ్డున నిలబడి తీర్పు చెబితే తిరుగులేని అంపైర్. విద్యార్థుల క్రీడా నైపుణ్యాన్ని గుర్తించడంలో కిటుకు తెలిసినఫిజికల్ డైరెక్టర్. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కాలేజి ఫిజికల్ డైరెక్టర్ కొత్త సావిత్రి.. ఆటలే ఆలంబనగా అనేకమంది విద్యార్థినుల జీవితాలు మార్చారు.ఆమె రాకెట్ పడితే ప్రత్యర్థులకు చెమటలే. సింగిల్.. డబుల్స్.. మిక్స్‌డ్ డబుల్స్.. ఫార్మాట్ ఏదైనా సక్సెస్ మాత్రం కొత్త సావిత్రిదే. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు సావిత్రి. యాభై ఆరేండ్ల నడి వయసు ఆమెకు అవరోధమే కాదు. మూడు దశాబ్దాల క్రితం సింగరేణి మహిళా జూనియర్ కాలేజీలో ఉద్యోగంలో చేరిన సావిత్రి.. అక్కడే డిగ్రీ కాలేజీ పీడీగా ప్రమోషన్ పొందారు. తనకు బాల్యం నుంచీ ఆటలంటే ఇష్టం. మూడు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించారు.షటిల్, బ్యాడ్మింటన్,టెన్నిస్‌లో ఎన్నో పతకాలు సాధించారు. ఇతర దేశాల్లో కూడా సత్తా చాటారు. భర్త సుధాకర్‌రెడ్డి షటిల్ కోచ్ కావడం తనకు కలిసొచ్చిన అంశం. టర్కీ, డెన్మార్క్, దుబాయ్, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా.. క్రీడాకారిణిగా సావిత్రి తిరగని దేశం లేదు. ఆడని మైదానం లేదు. తన సర్వీసులో.. ఏకంగా ఐదు వేల మంది విద్యార్థినులు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించారు. ఆ జాబితాలో.. పాల్వంచ కస్తూర్బాగాంధీ కాలేజీ ప్రిన్సిపల్ తులసి కూడా ఉన్నారు.తొలి లేడీ అంపైర్‌జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు రిఫరీ ఉండాల్సిందే. వారినే అంపైర్ అనీ అంటాం. రిఫరీ ఎంపికకు ఓ పరీక్ష ఉంటుంది. సావిత్రి ఆ వడపోతలో ఉత్తీర్ణత సాధించి..

రాష్ట్రంలోనే తొలి మహిళా రిఫరీగా నియమితులయ్యారు. గత ఏడాది.. గోవాలో జరిగిన షటిల్ టోర్నమెంట్‌లో చాంపియన్‌షిప్ కూడా సాధించారు సావిత్రి. సింగరేణి కాలేజీ ఆట మైదానం ఉదయం, సాయంత్రం విద్యార్థులతో కళకళలాడుతూ ఉంటుందంటే.. అదంతా సావిత్రి చొరవే. ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించి, సానబట్టి, రత్నాల్లా తయారు చేయడం ఆమె ప్రత్యేకత. 'నాకు చాంపియన్‌షిప్ రావడం కంటే.. నా కాలేజీలో చదువుకున్న పిల్లలకు మంచి మంచి ఉద్యోగాలు రావడమే ఎక్కువ సంతోషంకలిగిస్తున్నది. ఈ రూపంలో ఎంతోమంది అమ్మాయిల జీవితాల్ని మార్చగలిగినందుకు సంతోషంగా ఉంది. నాకు చిన్నప్పటి నుంచీ ఆటలంటే ఇష్టం. అందుకే మూడు ఆటల్లో చాంపియన్‌షిప్ సాధించాను' అని చెబుతారు ఫిజికల్ డైరెక్టర్ సావిత్రి.

# లండన్‌లో.. ఇండియన్ ఫ్యాషన్ గురు!





అనుభవాన్ని మించిన బిజినెస్ ఐడియా ఉండదేమో. అప్పటికి ఆష్నీ షాకు ఇరవై నిండాయి. లండన్‌లో ఫిల్మ్ మేకింగ్ చదువుతున్నది. అంతలోనే తన పెండ్లి కుదిరింది. 'షాపింగ్ కోసం ఇండియా వెళ్లడం ఎందుకు? ఇక్కడే కొనేద్దాం' అనుకుంది. కానీ లండన్ వీధులన్నీ తిరిగినా భారతీయ డిజైనర్ వస్త్రాలు కనిపించలేదు. దీంతో ముంబై విమానం ఎక్కాల్సి వచ్చింది.

ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ కంపెనీ.. సబ్యసాచి స్టోర్‌లో షాపింగ్ చేయాల్సి వచ్చింది. వివాహ వేడుకలు పూర్తికాగానే ఆమె చేసిన మొదటి పని.. లండన్‌లోని నాటింగ్ హిల్స్ ప్రాంతంలో ఆష్నీ అండ్ కో పేరుతో ఇండియన్ బ్రైడల్ బొటిక్ ప్రారంభించడం. తొలి రోజుల్లో చాలా ఇబ్బందులే పడింది.

ఆత్మవిశ్వాసంతో ప్రతి సవాలునూ ఎదుర్కొంది. మొత్తానికి వ్యాపారంలో నిలదొక్కుకుంది. ఇప్పుడు, తాను తొలుత షాపింగ్ చేసిన ముంబై మహానగర వీధుల్లోనూ ఆష్నీ అండ్ కో బొటిక్ తెరిచింది. నయాపైసా అప్పు చేయకుండా.. వ్యాపారాన్ని ప్రారంభించడం, విస్తరించడం తన ప్రత్యేకత.

# భారతమాతకు జేజేలు!



ఒకప్పుడు అది కరువు ప్రాంతం. ఏ ఉపాధీ ఉండేది కాదు. అలాంటి పరిస్థితులలో మహిళలంతా కలిసి తమ గెలుపు కథను తామే రాసుకున్నారు. కష్టపడి సంపాదించే ప్రతి రూపాయినీ జాగ్రత్తగాపొదుపు చేసుకోవడమే ఆర్థిక సాధికారతకు మార్గమని భావించారు.ఆ లక్ష్య సాధనలో భాగంగా.. భారతమాత మండల మహిళా సమాఖ్యను ఏర్పాటు చేసుకున్నారు. ఆ పరివారమే ఇప్పుడు దేశవ్యాప్తంగా 337 సంఘాలతో పోటీపడి ఉత్తమ మహిళా సమాఖ్య పురస్కారానికి ఎంపికైంది.

భీమదేవరపల్లి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత హనుమకొండ జిల్లాలో ఉంది. అప్పట్లో ఇక్కడ కరువు రాజ్యమేలేది. దీంతో ప్రతి ఇల్లూ ఓ అప్పుల కుప్పగా మారింది. స్థానికంగా ఉపాధి అవకాశాలూ నామ మాత్రమే. దీంతో పిల్లల్ని చదివించలేని పరిస్థితి. ఆడపిల్లలకు పెండ్లి చేయలేని పేదరికం. ఈ సమస్యకు పరిష్కారం వెతకడానికి మహిళలు నడుం బిగించారు. భీమదేవరపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో స్వయం సహాయ సంఘం(ఎస్‌హెచ్‌జీ)గా ఏర్పడ్డారు. గ్రామంలోని గ్రూపులన్నీ కలిసి గ్రామ సమాఖ్యగా%ా% గ్రామ సమాఖ్యలన్నీ కలిసి 'భారతమాత మండల మహిళా సమాఖ్య'గా రూపుదాల్చాయి. ఒక్కో స్వయం సహాయక సంఘంలో 10 నుంచి 19 మంది సభ్యులు ఉంటారు. ఐదొందల మందితో మొదలైన భారతమాత మండల సమాఖ్య బలగం ఇప్పుడు ఆరువేలు దాటింది. 1139 ఎస్‌హెచ్‌జీలు, 49 గ్రామ సంఘాలుగా విస్తరించింది. సంఘం ఏర్పడిన తొలిదశలోనే.. ప్రతి సభ్యురాలు రోజుకు ఒక రూపాయి చొప్పున నెలకు రూ. 30 పొదుపు చేయడం తప్పనిసరి చేశారు. అందులో ప్రతిపైసా సమర్థంగా వినియోగించుకున్నారు. అవసరం ఉన్న మహిళలకు రుణంగా ఇచ్చారు. అప్పు తీసుకున్నవారు ఆ మొత్తాన్ని వ్యవసాయానికి, పిల్లల చదువులకు వినియోగించారు. క్రమంగా స్వయం ఉపాధివైపూఅడుగులు వేశారు. పాడి పరిశ్రమ, పిండి గిర్ని, కూరగాయల సాగు, టైలరింగ్, నూనె మిల్లు నిర్వహణ.. ఇలా ఆసక్తి ఉన్న వ్యాపార మార్గాన్ని ఎంచుకున్నారు. అందులో విజయం సాధించారు. నాలుగురాళ్లు వెనకేసుకున్నారు. కుటుంబానికి అండగా నిలిచారు.

**ఆర్థిక సాధికారత..** పొదుపు సంఘాలు ఏర్పడిన కొత్తలో ఒక్కో గ్రూపునకు రూ.15 వేల బ్యాంకు రుణానికి మాత్రమే అర్హత ఉండేది. ఇప్పుడు ఆ మొత్తం సగటున రూ.23 లక్షలకు చేరింది. ఒక్కో సభ్యురాలికి సగటున కనీసం రూ.2 లక్షల బ్యాంకులోను అర్హత వచ్చింది. ప్రతి సంఘంలో మొదట్లో రూ.25 వేల కార్పస్ ఉండేది. ఇప్పుడది రూ.5 లక్షలకు చేరింది. ఎలాంటి గ్యారంటీ లేకుండా ప్రతి సంఘానికి రూ.22 వేల వరకు లోన్లు ఇస్తున్నాయి బ్యాంకులు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాల సదుపాయాన్ని కల్పించింది.దాన్నీ వినియోగించుకుంటున్నారు. రుణాల తిరిగి చెల్లింపు కూడా నూటికి నూరు శాతమే. సంఘాల ఆర్థిక నిర్వహణ పక్కాగా ఉంది.అన్ని వివరాలు డిజిటలైజ్ చేయడంతో ఈ సమాఖ్యకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. సంఘాలు అందించిన పెట్టుబడితో లాభదాయకమైన పంటలు పండిస్తూ రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతంఅవుతున్నాయి. సమాఖ్య ఆధ్వర్యంలో.. 28 రైతు ఉత్పత్తి సంఘాలు, ఐదు పాడి ఉత్పత్తి సంఘాలు ఏర్పడ్డాయి. రెండు వడ్ల కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో 70 శాతం ప్రజలు పేదరికంలో ఉండేవారు. తాజా నివేదిక ప్రకారం ఇది 40 శాతం లోపే ఉన్నది.మహిళల చొరవతో సాధించిన అద్భుత విజయం ఇది. కాబట్టే నాబార్డ్, ఏపీ మాస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా అందించే జాతీయ పురస్కారం దక్కింది. ఈ ఘనత కోసం 337 సంఘాలు తీవ్రంగా పోటీపడ్డాయి.

**అందరి సహకారంతో..** గతంలో పైసల కోసం అనేక కష్టాలు పడ్డాం. మా మండలంలో కూలీ కూడ సక్కగా దొరక్క పోయేది. అందుకే మేం పొదుపు చేసుకునే ఆలోచన చేసినం. అందరి కష్టంతో మా సమాఖ్య ఆర్థికంగా బల పడింది. ప్రతి మహిళకూ ఈ లాభాలు దక్కుతున్నాయి. సభ్యుల కృషి, ప్రభుత్వ చొరవ, అధికారుల తోడ్పాటుతోమా సమాఖ్య జాతీయ అవార్డుకు ఎంపికైంది.

**పోలు రజిత, సమాఖ్య అధ్యక్షురాలు**

**సంతోషంగా ఉంది..** క్రమం తప్పకుండా రుణాలు తిరిగి చెల్లిస్తున్నాం. అధికారుల సూచనతో అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం. మా సభ్యుల ఆరోగ్యం కోసం అనేక చర్యలు చేపట్టాం.

# లక్కీ.. లక్క గాజులు!







కుటుంబానికి అండగా నిలవాలనే ఆలోచన.. ఓ స్టార్టప్ ఏర్పాటుకు కారణమైంది. పది మందికి ఉపాధి మార్గమైంది. ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో హ్యాండ్ మేడ్ గాజులను ఇతర రాష్ట్రాలకూ సరఫరా చేస్తున్నది ఆమె. అంతేకాదు, వీహబ్ నేర్పిన వ్యాపార మెలకువలతో లక్క గాజుల తయారీని కుటీర పరిశ్రమ స్థాయికి తీసుకెళ్లింది. అలా, సృజనలో తనకు తిరుగులేదని నిరూపించుకుంటున్నది నిజామాబాద్ జిల్లాకు చెందిన ఉజ్మా బేగం. ఉజ్మా బేగం.. తెలివైనది. చురుకైనది. కష్టసుఖాలు తెలిసిన యువతి. డిగ్రీ వరకూ చదివింది. నిజామాబాద్ జిల్లాలోని మాక్లూర్ తన సొంతూరు. పెండ్లి తర్వాత, తన అత్తింటికి అండగా నిలవాలనుకుంది. ఇద్దరు పిల్లల చదువులు, ఇంటి ఖర్చులకు సరిపడేంత ఆదాయం సమకూరితే చాలన్నట్టు మొదలు పెట్టింది. గాజుల తయారీలో అపార అనుభవం ఉన్న మామయ్య దగ్గర శిక్షణ తీసుకుంది. క్రమంగా ఆ కళపై పట్టు సాధించింది. నలుగురికీ నేర్పగల నైపుణ్యమూ అబ్బింది. అప్పటినుంచి ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇచ్చేది. ఆ వ్యాపకాన్ని కొనసాగిస్తూనే.. ఎనిమిదేళ్ల కిందట లక్క గాజుల తయారీ యూనిట్ ప్రారంభించింది. ఆధునిక ఫ్యాషన్లకు దీటుగా, అతివలను ఆకట్టుకునే డిజైన్లకు ప్రాణం పోసింది. ఒకరిద్దరితో మొదలైన వ్యాపారం క్రమంగా పదిహేను మందికి జీతాలు ఇచ్చే స్థాయికి చేరింది. మరికొంతమంది పార్ట్‌టైమ్ సిబ్బందీ ఉన్నారు. తొలుత యూనిట్ నిర్వహణ సులభంగానే అనిపించినా.. ఆర్థిక సమస్యలు నిత్యం వెనక్కి లాగేవి. కొన్నిసార్లు ముడిసరుకు కొనుగోలుకు కటకట. కొన్నిసార్లు జీతాలకు ఇబ్బంది. ఏం చేయాలో తోచని పరిస్థితి. ఆ సంక్షోభ సమయంలో భర్త అండగా నిలిచారు. ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) సమకూర్చిన సొమ్ము దానికి తోడైంది. అలా కష్టాలు గట్టెక్కాయి. దీంతో ఉజ్మా బేగం నాణ్యత మీదే దృష్టిపెట్టింది.

**సృజనతో...**

కస్టమర్లు కొత్తదనాన్ని కోరుకుంటారు. ట్రెండ్స్ ఫాలో అవుతారు. ఆ నాడిని మనం పట్టుకోవాలి. సృజనతో మెరుపులు మెరిపించాలి. అప్పుడే, మనసులు గెలుస్తాం. మనుగడ సాధిస్తాం. కొత్త డిజైన్లు సృష్టించడంలో ఉజ్మాకు తిరుగులేదు. దీంతో ఆర్డర్లు పెరిగాయి. ఉత్పత్తి అధికమైంది. ఆ లక్క గాజులకు మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాలతోపాటు, పొరుగు రాష్ట్రాల్లోనూ మంచి గిరాకీ ఉంది. తన దగ్గర నేరుగా కొనే కస్టమర్ల సంఖ్య దాదాపు ఐదొందలు. ఇక రిటెయిలర్ల ద్వారా కొనేవారు లెక్కలేనంతమంది. నిజంగానే ఆ లక్క గాజులు ఏ అంతర్జాతీయ శ్రేణి కారా□నాలోనో తయారు చేసినట్టు ఉంటాయి.

**వీహబ్‌తో దోస్తీ...**

'నా ప్రయాణంలో వీహబ్ సహకారం మరువలేనిది' అని చెబుతుంది ఉజ్మా. తొలి దశలో ఐకేపీ ఆర్థిక ప్రోత్సాహం అందిస్తే.. ఎదుగుతున్న దశలో వీ హబ్ నేనున్నానంటూ తోడైంది. ఆ అనుబంధమూ విచిత్రంగానే మొదలైంది. జిల్లా డ్వాక్రా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశానికి వీ హబ్ సీఈవో దీప్తి రావుల వెళ్లారు. అక్కడే ఉజ్మా ఆమెను సంప్రదించింది. ఆమె చురుకుదనం, ఉత్సాహం దీప్తికి చాలా నచ్చాయి. వీహబ్‌కు ఆహ్వానించారు. ఉజ్మా ఉత్సాహంగా హైదరాబాద్ ప్రయాణమైంది.. వీహబ్ ఓ స్ఫూర్తికేంద్రంలా కనిపించింది ఆమెకు. ఓరియెంటేషన్ సెషన్‌లో పాల్గొనడం ద్వారా వ్యాపారానికి అవసరమైన నిర్మాణ వ్యవస్థ, మార్కెటింగ్, ఫైనాన్స్ తదితర అంశాలపై అవగాహన వచ్చింది. ఆ సూత్రాలను తన యూనిట్‌కు అన్వయిస్తూ క్రమంగా విస్తరణ చేపట్టింది ఉజ్మా.



ఏపీ, తెలంగాణలోని ఔత్సాహిక మహిళలకు తరచూ శిక్షణ తరగతులు నిర్వహిస్తుంది ఉజ్మా. వారాల తరబడి ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడమనేది వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారం. వ్యాపారానికి కూడా ఇబ్బంది. దీంతో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని భావిస్తున్నది. యూట్యూబ్ ఛానెల్ ప్రారంభానికి కూడా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవి కనుక అందుబాటులోకి వస్తే.. సాధారణ మహిళలు సైతం ఇంటి దగ్గరే కూర్చుని సొంతంగా గాజులను డిజైన్ చేసుకోవచ్చు. స్వయం ఉపాధిని పొందవచ్చు. 'ఏ మహిళకైనా సంపాదనతో ఆత్మవిశ్వాసం వస్తుంది. ఆత్మగౌరవమూ పెరుగుతుంది. తోటి స్త్రీల కోసం నేను చేస్తున్న ప్రయత్నమూ అలాంటిదే' అంటుంది ఉజ్మా.

ప్రజా చైతన్యమే...
లక్ష్యం
తెలుగు దినపత్రిక
శనివారం 23 ఆగష్టు 2025

## విజ్ఞాన్స్ యూనివర్సిటీలో వైభవంగా వరలక్ష్మీ వ్రత వేడుకలు

చేబ్రోలు ఆగస్టు 22( లక్ష్యం న్యూస్ ):::చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ సిబ్బంది, పలువురు విద్యార్థులు సామూహిక వ్రత పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ వ్రతమంటే నియమబద్ధమైన నడవడిక, క్రమశిక్షణతో కూడిన ఆచరణ, వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో ప్రాముఖ్యాన్ని తెలియజెప్పడమే వ్రతం ఆంతర్యమన్నారు. వరం అంటే శ్రేష్ఠతని, మనకు దక్కేది ఏదైనా అత్యుత్తమైనదిగా ఉండాలని కోరుకుంటామన్నారు. అలాగే జీవితంలో ఏ బాధ్యతల్ని స్వీకరించినా ఉత్తమంగా నిర్వర్తించాలన్నారు. శ్రద్ధ, ఆసక్తులతో చేస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. కాబట్టి చదువైనా, ఇతర పనులైనా మనసుపెట్టి పూర్తి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆహ్లాదానికి, ఉత్సాహానికి, ప్రసన్నతకు, చిరునవ్వుకు అమ్మవారు ప్రతీక అని తెలియజేసారు. ప్రసన్నంగా, కారుణ్యంతో సౌమ్యలక్ష్మిగా కనిపించే ఆ తల్లే ఆగ్రహిస్తే వీరలక్ష్మిగా మారుతుందన్నారు. ఆశావహ దృక్పథంతో విజయం సాధిస్తే జయలక్ష్మిని, తలపెట్టిన కార్యానికి కావాల్సిన విజ్ఞానం, సమయస్ఫూర్తి, నిర్ణయ శక్తులను సంపాదించడం ద్వారా విద్యాలక్ష్మిని ఆరాధించవచ్చునన్నారు. మిగిలిన లక్ష్మీ పూజలకంటే వరలక్ష్మీ పూజ శ్రేష్టమని, విశేష ఫలితాలు దక్కుతాయని తెలిపారు. విదేశీయులు సైతం ప్రస్తుతం మన సంప్రదాయాలను ఆచరిస్తున్నారని తెలిపారు. మన పండుగలు, వాటిని జరుపుకునే తీరు చూసి ప్రపంచం అబ్బురపడుతోందన్నారు. ఎప్పటికీ మన సంస్కృతిని యువత మరిచిపోరాదనే ఉద్దేశంతో ఇలా అన్ని పండుగలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలుత విఘ్నేశ్వర పూజ అనంతరం వరలక్ష్మీ వ్రతం కొనసాగింది. కళాశాల విద్యార్థినులు ప్రత్యేక పూజల్లో ఆసక్తిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: కమిషనర్ వేణుబాబు



మాచర్ల లక్ష్యం ప్రతినిధి : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం అని మాచర్ల మున్సిపల్ కమిషనర్ డి వేణుబాబు అన్నారు. స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ మాచర్ల వారి ఆధ్వర్యంలో ఉచిత యోగ తరగతులు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన యోగ కార్యక్రమంలో కమిషనర్ వేణుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత యోగ తరగతులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 8 గం వరకు పురుషులకు, సాయంత్రం 5:30 నుంచి 6:30 వరకు స్త్రీలకు ఉచిత యోగ క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరములకు 944 0006813 మరియు 9346162835 లను సంప్రదించగలరని తెలిపారు.

## వక్ఫ్ బోర్డు నిధులు చైర్మన్ జేబు నుంచి రావడం లేదు" - ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా



గుంటూరు ఆగస్టు 22లక్ష్యం ప్రతినిది రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ సంస్థల వాస్తవ పరిస్థితులను విస్మరించి, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ స్వేచ్ఛగా వక్ఫ్ నిధులను వినియోగిస్తున్న తీరు తీవ్ర ఆందోళనకరంగా ఉందని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా తీవ్రంగా విమర్శించారు.రాష్ట్రంలోని వక్ఫ్ సంస్థలలో కేవలం 10% సంస్థలకే ఆస్తులు, బ్యాంకు నిధులు, సంపన్న వర్గం ఉంటే, మిగతా 90% వక్ఫ్ సంస్థల ముతవల్లీలు, ముజావర్లు పేదరికంలో జీవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని పేర్కొన్నారు.“ఇలాంటి పరిస్థితిలో, వక్ఫ్ సంస్థల నుండి వచ్చే ఆదాయాన్ని మొదటగా ముతవల్లీలు, ముజావర్లు మరియు వారి కుటుంబాల సంక్షేమం కోసం వినియోగించాలి. వారి పిల్లలకు విద్య, ఉపాధి, జీవన భద్రత కల్పించిన తరువాతే ఇతరులకు సాయం చేయడం సమంజసం” అని ఆయన స్పష్టం చేశారు.వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ప్రస్తుతం వక్ఫ్ నిధులను స్వయంకృత నిర్ణయాలతో బయటి వారికి సాయాలు అందించడం, అభివృద్ధి పేరుతో కార్యక్రమాలు చేపట్టడం వక్ఫ్ చట్ట విరుద్ధమని నాగుల్ మీరా మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని చెబుతున్నప్పటికీ, వాటి అమలులో లోపాలున్నాయని, అందుకే వక్ఫ్ నిధులను వేరే మార్గంలో వినియోగించడం సమంజసం కాదని ఆయన అన్నారు.‘తన ఇంటి పిల్లలను చక్కదిద్దని తండ్రి, పక్కింటి పిల్లలను చక్కదిద్దుతానని తిరగడం ఎంతవరకు సమంజసం?” అనే ప్రశ్న ముస్లిం సమాజంలో కలకలం రేపుతోందని ఆయన వ్యాఖ్యానించారు.ఈ విధానం కొనసాగితే రాబోయే రోజుల్లో ముతవల్లీలు, ముజావర్లు నిరసనలకు దిగే పరిస్థితి తప్పదని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలన్నారు.అందువల్ల, వక్ఫ్ నిధుల వినియోగంలో ముతవల్లీలు, మజావర్ల కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని, వారికి ఆర్థిక, విద్యా, ఉపాధి పరమైన సహాయం అందించాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రభుత్వం, వక్ఫ్ బోర్డును విజ్ఞప్తి చేస్తోందని షేక్ నాగుల్ మీరా తెలిపారు.

# ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ - 2025 పోస్టర్ ను విడుదల చేసిన - జిల్లా కలెక్టర్.



గుంటూరు ఆగస్టు 22( లక్ష్యం న్యూస్ ):: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి ఆదేశముల మేరకు ఆంధ్రప్రదేశ్ లో ఉన్నటువంటి నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తున్నది. దీనిలో భాగముగా నిరుద్యోగ యువతకు వారికి ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారం తో ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ %-% 2025 పోస్టర్ ను ఎస్. నాగలక్ష్మి, ఐ.ఎ.ఎస్., కలెక్టర్ %�a% జిల్లా మేజిస్ట్రేట్ గారు, ఈరోజు %ఙ=జ% మీటింగ్ హాల్, కలెక్టరేట్ నందు స్కిల్స్ కాంపిటీషన్ పోస్టర్ ను విడుదల చేసిన్నారు. జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యువతీ యువకులు ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ %-% 2025 నందు పాల్గొని తమ నైపుణ్యాల ద్వారా ఉత్తమ శిఖరాలు అధిరోహించడానికి ఇది మంచి అవకాశం. ఇందున పాలుగొన్న యువతకు 2025 నందు 2025 నిర్వహిస్తున్న ప్రపంచ నైపుణ్య పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుంది అని తెలియజేచినారు. ఇందుకు గాను సెప్టెంబర్ 30 వ తారీకులోపు ఆసక్తి వున్నా యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకొనవలసిందిగా తెలియజేశారు. కావున జిల్లా లో వున్నా యువతి యువకులు సెప్టెంబర్ 30 వ తారీకు లోపు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకొనవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రములో జయలక్ష్మి జనరల్ మేనేజర్ జిల్లా పరిశ్రమల శాఖ, టీవీ విజయలక్ష్మి ప్రాజెక్ట్ డైరెక్టర్ డిఆర్డిఏ, కె. సంజీవరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, దుర్గ భాయి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, ఇతర గుంటూరు జిల్లా అధికారులు పాల్గొనారు.గుంటూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు మాట్లాడుతూ ఈ ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ %-% 2025 లో ఐటీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, నిర్మాణం, మొదలైనవి మొత్తం 63 నైపుణ్య ట్రేడ్‌లపై నిర్వహించబడుతుందిబీ జనవరి 01, 2001న లేదా ఆ తర్వాత జన్మించిన యువతీ యువకులు పాల్గొనడానికి అర్హులు. ఆసక్తిగల అభ్యర్థులు క్రింద ఉన్న లింక్‌ను ఉపయోగించి వారి పేర్లను నమోదు చేసుకోవాల్సిదిగా తెలియజేశారు.

# కాంగ్రెస్ మాత్రమే బీసీల అభివృద్ధికి నిజమైన హామీ



విశాఖపట్నం ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్ ):: విశాఖ జిల్లా పర్యటనలో %-% రాష్ట్ర ఓబీసీ చైర్మన్ శాంతి నాగరాజు మాట్లాడుతూవిశాఖపట్నం జిల్లా ఓబీసీ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వర్మ గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో అన్ని నియోజకవర్గాల నుండి ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, మండల చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు సమగ్రంగా పాల్గొని జిల్లా కాంగ్రెస్ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తున్నారని వెల్లడించారు. ఇంకా కొన్ని నియోజకవర్గాల్లో కమిటీలు లేని కారణంగా రాబోయే రోజుల్లో వాటిని పూర్తి చేసి, జిల్లా అధ్యక్షులు వర్మ గారి ఆధ్వర్యంలో ఒక భారీ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శాంతి నాగరాజు గారు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకులుగా మాత్రమే వాడుకుంటూ, వారికి ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేస్తూ వస్తోందని తీవ్రంగా విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసపూరిత విధానాలతో మభ్యపెడితే జిల్లా ఓబీసీ కాంగ్రెస్ నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేపట్టక తప్పదని హెచ్చరించారు. “బీసీ వర్గాలను కేవలం ఓటు బ్యాంక్‌లా వాడుకోవడం పాత పద్ధతి, బీసీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ మాత్రమే నిజమైన కృషి చేసింది. వైఎస్ షర్మిల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణ దిశగా ముందుకు వెళ్తోంది. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఓబీసీ కాంగ్రెస్ శక్తివంతంగా ప్రదర్శన చేసి, పార్టీ పునరుద్ధరణకు అడ్డుగోడలా నిలుస్తుంది” అని అన్నారు. అలాగే విశాఖ జిల్లా ఓబీసీ కాంగ్రెస్ నాయకులు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేయాలని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ శక్తివంతమైన ప్రదర్శన ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన విశాఖపట్నం డీసీసీ అధ్యక్షులు వర్మ గారికి,వెంకట సూర్యనారాయ కి ధన్యవాదాలు తెలియచేశారుకార్యక్రమంలో పాల్గొన్నవాళ్లు రాష్ట్ర %ూ% డిపార్ట్మెంట్ ఇంచార్జి పాచిపెంట శాంతకుమారి ,విజయనగరం జిల్లా ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ వెంకట రమణ , అల్లూరి జిల్లా ప్రవీణ్ , మాజీ హ్యూమన్ రైట్స్ చైర్మన్ గుడివాడ ఇంచార్జి మన్యం రాజశేఖర్ అలాగే నాలుగు జిల్లాల నుండి హాజరైన ఓబీసీ కాంగ్రెస్ నాయకులు, కోఆర్డినేటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సినీ చరిత్రలో చిరు అధ్యాయం సువర్ణలిఖితం

**నటుడిగానే కాకుండా సమాజ సేవకుడి ఆదర్శం**

**తెలుగు సినిమాను ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప నటుడు**

**గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**నియోజకవర్గంలో ఘనంగా చిరు జన్మదిన వేడుకలు**




గుంటూరు ఆగస్టు 22 లక్ష్యం ప్రతినిది తెలుగు సినీ చరిత్రలో చిరంజీవి అధ్యాయం సువర్ణలిఖితమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం గుంటూరు తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే నసీర్ జన్మదినోత్సవ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమకు దొరికిన ఆణిముత్యం చిరంజీవి అని కొనియాడారు. పాతతరం, కొత్తతరానికి వారధిగా తెలుగు సినీ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. వెండి తెరపై చిరంజీవి స్టెప్పులకు ఉర్రూతలూగని వారంటూ లేరని, అందరూ ఆయన అభిమానులేనని పేర్కొన్నారు. కేవలం నటుడుగానే కాకుండా బ్లడ్ బ్యాంక్ ద్వారా వేల మందికి సేవ చేస్తున్న ఆదర్శ నాయకుడని చెప్పారు. స్వయంకృషితో ఎదిగిన చిరంజీవి నలుగురిలో ఒక్కడిలా కాకుండా నలుగురికీ తానే మార్గదర్శకునిగా ఎదిగిన తీరు అందరికీ ఆదర్శమని అన్నారు. చిరంజీవి వ్యక్తిత్వం, సహనం ఆయనకు కీర్తిని సంపాదించిపెట్టాయని తెలిపారు. చిరంజీవి సినిమా అంటే ఒక ఎమోషనల్ అని, అది కేవలం రెండున్నర గంటల సినిమా మాత్రమే కాదని అన్నారు. ఆయన సినిమాలు వినోదమే కాకుండా సమాజాన్ని మేల్కొలిపేలా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పద్మ విభూషణ్, డాక్టర్ చిరంజీవి 70 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన అభిమానులు.

(లక్ష్యం ప్రతినిధి కారంపూడి)పద్మ విభూషణ్, మెగాస్టార్, డాక్టర్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు మండల కేంద్రమైన కారంపూడి బస్టాండ్ లో గల వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద చిరంజీవి అభిమానులు, జనసేన నాయకులు, టిడిపి నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా మోహన్ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు., అనంతరం రంగా విగ్రహం వద్ద చిరంజీవి పుట్టినరోజు కేకును నాయకులు, అభిమానులు కట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కర్ణ సైదారావు మాట్లాడుతూ డాక్టర్ చిరంజీవి గారికి సినిమా రంగంలో ఈ గుర్తింపు అంత సులభంగా వచ్చింది కాదని, తాను ఎంతో కష్టపడి మెగాస్టార్ స్టేజికి ఎదిగాడని అన్నారు. సినిమా రంగంలో మొన్నటి వరకు దాసరి నారాయణరావు పెద్దదిక్కుగా ఉండి, అందరిని కలుపుకుంటూ సినిమా ప్రపంచం బాగోగులను చూసుకుంటూ ఉండేవారని, వారి మరణానంతరం చిరంజీవి గారు ఆ బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకొని ఎంతో ఓర్పుగా సినీ రంగాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో సినిమా రంగం తరపున అప్పటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని కలవడానికి వెళ్ళినప్పుడు వారు చిరంజీవిని మరియు ఇతర సభ్యులను ఎంత అవమానకరంగా మాట్లాడి అవమానించి పంపించారో ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ఇంకా గుర్తుందని అన్నారు. తన సందేశాత్మకమైన సినిమాల ద్వారా యువతకు సమాజంపై తమ బాధ్యతను తెలియపరచవారని చెప్పారు. ప్రమాదాల సమయంలో మరియు ఇతర సందర్భాలలో రక్తం పోగొట్టుకొనిన అభాగ్యుల కొరకు రక్త నిధిని ఏర్పాటు చేసి, రాష్ట్రపతి మరియు రెడ్ క్రాస్ సొసైటీల ద్వారా అవార్డులు పొందిన మహోన్నవితమైన వ్యక్తిత్వం కలిగినవాడని కొని ఆడారు. ఈ వేడుకలలో జనసేన పార్టీ మాచర్ల నియోజకవర్గం ఇన్చార్జి బూస రామాంజనేయులు, తెలగనేని లక్ష్మయ్య, గణిత అమరయ్య, ఎస్ఎంకె నాయుడు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు కేశనపల్లి కృష్ణ బాబు, కోరే సత్యం, తోట రంగారావు, మిర్యాల వెంకటేశ్వర్లు, చలవధి సాయి,తోటఅల్లయ్య,తోట శ్రీనివాసరావు, బండారు వీరేశ్వర రావు, చిరంజీవి అభిమాన సంఘాల వారు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంకా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులకు ప్రజలకు పులిహార ప్యాకెట్స్ తో పాటు స్వీట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

## వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ ఐ టి శివరామకృష్ణ..

యడ్లపాడు ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్): 16వ నెంబర్ జాతీయ రహదారి తిమ్మాపురం బైపాస్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ సేఫ్టీకి సంబంధించి ప్రత్యేకంగా వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించి నట్లు ఎస్ ఐ టి శివరామకృష్ణ తెలిపారు. తనిఖీల సమయంలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 51 మంది పై కేసు నమోదు చేసి 52,785/- రూపాయల జరిమానా విధించామని,మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఐ టి శివరామకృష్ణ మాట్లాడుతూప్రజల ప్రాణ భద్రత మాకు ప్రథమ ప్రాధాన్యం. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ ధరించడం మిమ్మల్ని ప్రమాదం నుండి కాపాడుతుందని అన్నారు. ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రోడ్డు భద్రతకు సంబంధించి పోలీస్ శాఖ తరపున మేము తరచూ తనిఖీలు చేస్తాము. ఇది ప్రజల శ్రేయస్సు కోసమే అని అన్నారు.సమాజం భద్రత కోసం ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ సహకరించాలని, హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని విజ్ఞప్తి చేశారు. మీ ప్రాణాలు మీ చేతుల్లోనే ఉన్నాయి %-% హెల్మెట్ ధరించండి, సురక్షితంగా ఉండండి. శాంతి భద్రతలకు సహకరించండి అని ఎస్ ఐ టి శివరామకృష్ణ అన్నారు. ఈ తనిఖీలలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును లబ్ధిదారునికి పంపిణీ చేసిన - ధూళిపాళ్ళ...



చేబ్రోలు ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్ ):: అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 2 చెక్కులను 2,87,940/- మొత్తాన్ని చేబ్రోలు మండలంలోని లబ్ధిదారులకు పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అందజేశారు.

లబ్ధిదారుల వివరములు ..

1. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ సత్తార్ గారికి 2,02,940/-
2. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన పెద్ది శ్రీనివాసరావు గారికి 85,000/-

ఈ సందర్భంగా రేంద్రకుమార్ గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని మెరుగైన వైద్య నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం క్షతగాత్రులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని కూటమి ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి అని అన్నారు...ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ,పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కి కృతజ్ఞతలు తెలియజేశారు....ఈ కార్యక్రమంలో చేబ్రోలు మండల తెలుగుదేశం - జనసేన - బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొనినారు....

## అనకాపల్లి జిల్లా ఓబీసీ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం



అనకాపల్లి ఆగస్టు (లక్ష్యంన్యూస్ )::అక్రమ మైనింగ్, ప్రజలపై జరుగుతున్న దోపిడీలపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం: రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శౌంఠి నాగరాజులి

అనకాపల్లి జిల్లా ఓబీసీ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శౌంఠి నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లా ఓబీసీ కాంగ్రెస్ ముందంజలో ఉందని, అన్ని నియోజకవర్గాల్లో కోఆర్డినేటర్లు సమన్వయంతో పని చేసి కమిటీలను పూర్తి చేయడం, మండల, నియోజకవర్గ స్థాయిలో ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయడం వల్ల జిల్లా కాంగ్రెస్ మరింత బలంగా ముందుకు వెళ్తోందని అభినందించారు.అయితే, ఈ జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్ పరిస్థితులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇప్పటికే జిల్లాలోని బడా బాబులు, కొంతమంది పాలక పార్టీ ఎమ్మెల్యేలు కలసి జిల్లాను ముక్కలుగా చీల్చి నిరంతరం దోపిడీ చేస్తున్నారు. కొండలు, గుట్టలు, అడవులు నాశనం చేసి అక్రమ మైనింగ్ పెంచుతున్నారు. కాని ఈ దోపిడీతో జిల్లాలోని సామాన్య ప్రజలకు ఏ ఒక్క రూపాయి ఉపయోగం లేదు. స్థానికులకు ఉపాధి లేదు, పరిసరాలకు నష్టం, తాగునీటి వనరులకు ముప్పు %-% ఈ పరిస్థితి చాలా దురదృష్టకరం. ప్రభుత్వం మాత్రం ఈ అన్నింటినీ కనీసం పట్టించుకోవడం లేదు. ఈ పాలకులు ప్రజలను కాపాడటానికి కాకుండా, ప్రజల వెన్ను మీదే కొరడామోస్తున్నారు" అని ఆయన విమర్శించారు."బీసీలను కేవలం ఓటు బ్యాంకులా వాడుకోవడం గత పాలకుల అలవాటు. ఈరోజు కూడా అదే విధంగా కొనసాగిస్తున్నారు. ఎన్నికల ముందు బీసీలకు హామీలు ఇస్తారు, కుర్చీలో కూర్చున్న తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చరు. బీసీలకు నిజమైన గౌరవం ఇచ్చేది, బీసీల అభివృద్ధి కోసం కృషి చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. వైఎస్ షర్మిల గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ తిరిగి పునరుద్ధరించబడుతోంది. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఓబీసీ కాంగ్రెస్ శక్తివంతమైన ప్రదర్శన చేస్తుంది, బీసీ వర్గాల గళాన్ని ప్రతి మూలలో వినిపిస్తుంది. ఇకపై కాంగ్రెస్ పార్టీనే ప్రజల కోసం అడ్డుగోడగా నిలుస్తుంది" అని శౌంఠి నాగరాజు స్పష్టం చేశారు."ఇకనుంచి అనకాపల్లి జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్, ల్యాండ్ మాఫియా దోపిడీలపై ఓబీసీ కాంగ్రెస్ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తుంది. రాస్తారోకలు, ధర్నాలు, ఆందోళనలు %-% ప్రజా పోరాటాలన్నింటిని చేపట్టబోతున్నాం. ఈ అక్రమాల వెనుక ఉన్న బడా బాబులు, ఎమ్మెల్యేలు ఎవరు అయినా, వారి పేర్లు బహిరంగం చేస్తాం. ఇక ప్రజల పక్షాన పోరాడక తప్పదు. బీసీ వర్గాలు, వెనుకబడిన తరగతులు మోసపూరిత పాలనకు బలి కావడం ఇక సహించం" అని ఆయన గట్టిగా హెచ్చరించారు.ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఓబీసీ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పార్టీ పూర్వ వైభవం తిరిగి సాధించడానికి అన్ని నియోజకవర్గాల్లో జెండా ఎగరవేయడానికి సిద్ధమై ఉన్నామని, రాబోయే ఎన్నికల్లో ప్రజల పక్షాన కట్టుబడి పోరాడతామని హామీ ఇచ్చారు.ఈ సమావేశానికి విచ్చేసిన నియోజకవర్గ కోఆర్డినేటర్లు, ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, కార్యకర్తలందరికీ శౌంఠి నాగరాజు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

### ఉన్నతమైన లక్ష్యాలు విద్యార్థులు ఏర్పాటు చేసుకోవాలి



గుంటూరు ఆగష్టు 22(లక్ష్యం న్యూస్)::స్థానిక టి జె పి యస్ కళాశాల లో బి యస్ సి తృతీయ సంవత్సరం చదువుతున్న ఆళ్ళ స్వరాజ్య లక్ష్మి కౌండిన్య (ఐ ఏ యస్ ) అకాడమీ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన మరియు వక్తృత్వం పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ శ్రీ కె వి బ్రహ్మం విద్యార్థిని అభినందించారు. ప్రతి ఒక్క విద్యార్థి కూడా విద్యార్థి దశలో స్పష్టమైన మరియు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని, లక్ష్య చేదనలో ఎదురయ్యే స్థితిగతులను ఎదుర్కొని లక్ష్యాన్ని సాదించి, జీవితాలలో స్థిర పడాలని పేర్కొన్నారు. ఎన్ని సమస్యలు వచ్చినా ఆత్మ విశ్వాసాన్ని, ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోవద్దని చెప్పారు.

# గ్రామీణ ప్రాంతాలకు, దూర ప్రాంతాలకు బస్




పొన్నూరు ఆగస్టు 21 ( లక్ష్యం న్యూస్ )::: ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న పొన్నూరు ఆర్టీసీ డిపో అభివృద్ధికి నూతన భవనాల నిర్మాణానికి గ్రామీణ, సుదూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు పెంచుటకు, విజ్ఞప్తులను వైస్ చైర్మన్ మరియు %వీణ జష్ట్ర%. ద్వారకా తిరుమలరావు కి అందజేసిన పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు మరియు సంగం డెయిరి చైర్మన్ శ్రీ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ...

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ గారు మాట్లాడుతూ 1966 సంవత్సరంలో ప్రారంభమైన పొన్నూరు ఆర్టీసీ డిపో అనేక దశాబ్దాలుగా సేవలందించినప్పటికీ వివిధ కారణాలతో డిపో వెనకబడి పోయినది. గతంలో పొన్నూరు డిపో నుంచే బాపట్ల ఏరియాకు బస్సు సర్వీసులు నడిచేవి. అదేవిధంగా మన డిపో నుంచే చీరాల విజయవాడ ఎక్స్ప్రెస్ సర్వీస్ లో నిర్వహించేవారు. కానీ 2009 - 14 మధ్య డిపోను మూసివేస్తే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 2014 తెలుగుదేశం పార్టీ అధికారంలో చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రిగా మాన్యశ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే బస్సు డిపోను పునః ప్రారంభించాం. పొన్నూరు మండలంలోని ప్రతి గ్రామంతో పాటు, పొరుగు నియోజకవర్గాలకు కూడా బస్సు సర్వీసులు నడపాలని అలాగే సుదూర ప్రాంతాలైన శ్రీశైలం, తిరుపతి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, రాయచోటి, సింధనూర్, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు బస్ సర్వీసులు కల్పించాలని ఆర్టీసీ ఎండి సిహెచ్ . ద్వారకా తిరుమల రావు %శ్రీ%ని కోరగా వారు వెంటనే సానుకూలంగా స్పందించి బస్ సర్వీసులు కనిపిస్తామన్న హామీ ఇవ్వడం హర్షణీయమని ఈ సందర్భంగా లిఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ లి అన్నారు...ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

# యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు

**హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు పావులూరి**

**ఏపీ స్పేస్‌టెక్ అకాడమీ ఏర్పాటు**

**విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్**

చేబ్రోలు ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్ )::కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రాజెక్టులు, పరిశోధనలు %-% ఇవన్నీ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిస్తాయని హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు పావులూరి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని టీమ్ సీవోఈ%-% స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబొరేషన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు పావులూరి మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన విజయాలను స్మరించుకోవడమే కాకుండా, భవిష్యత్తు తరం శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చే రోజు జాతీయ అంతరిక్ష దినోత్సవమని తెలియజేసారు. 2023 ఆగస్టు 23న చంద్రయాన్%-%3 మిషన్ ల్యాండర్ విక్రం చంద్రుడి ఉపరితలాన్ని తాకిన చారిత్రక సందర్భాన్ని గుర్తుగా చేసుకుంటూ, ఈ రోజును అధికారికంగా జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారని వెల్లడించారు. ఇది కేవలం ఒక శాస్త్రీయ ఘట్టం మాత్రమే కాదు, దేశం కలలుగన్న అంతరిక్ష ప్రయాణాల దిశలో కొత్త అధ్యాయానికి నాందని పేర్కొన్నారు. 1969లో డాక్టర్ విక్రం సారాభాయ్ దర్శనంతో స్థాపించబడిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సాధారణ రాకెట్ ప్రయోగాలతో మొదలైన తన ప్రయాణాన్ని నేడు ప్రపంచంలో అగ్రగామి అంతరిక్ష సంస్థలలో ఒకటిగా నిలబెట్టుకుందన్నారు. అంతరిక్షం అంటే కేవలం గ్రహాలపై పరిశోధన కాదని, అంతరిక్ష సాంకేతికత నేరుగా ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతోందన్నారు. పంటల ఉత్పత్తి అంచనాలు, నీటి వనరుల విశ్లేషణ, భూసార నాణ్యతా అధ్యయనాల్లో ఉపగ్రహ డేటా రైతులకు దోహదం చేస్తోందన్నారు. తుఫానులు, వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే గుర్తించి, మానవ నష్టాన్ని తగ్గించడంలో ఉపగ్రహాల సమాచారమూ కీలకమని తెలియజేసారు.

ఏపీ స్పేస్‌టెక్ అకాడమీ ఏర్పాటు

విజ్ఞాన్స్ వర్సిటీలో జరిగిన నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌లో ఆంధ్రప్రదేశ్ స్పేస్‌టెక్ అకాడమీ (ఏపీఎస్ఏ)ను ఏర్పాటు చేసారు. ఈ కమిటీకు నూతన అధ్యక్షుడిగా అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ %-% మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 2025 మొదటి వారంలో అమరావతిలో తొలి ఏపీ స్పేస్‌టెక్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్‌లో జరిగే స్పేస్‌టెక్ సమ్మిట్‌లో విద్యావేత్తలు, పరిశ్రమలు, పాలసీ మేకర్స్, ఆవిష్కర్తలు ఒకే వేదికపైకి చేరి జ్ఞానం పంచుకోవడం, సాంకేతిక పురోగతిని ప్రదర్శించడం, తదుపరి తరాన్ని ప్రేరేపించడం జరుగుతుందన్నారు. రాబోయే అంతరిక్ష శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, వ్యాపారవేత్తలు, నాయకులను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సమ్మిట్‌ను రూపొందించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమం సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, అంతరిక్ష శాస్త్రం నేరుగా సమాజ అభివృద్ధి, జాతీయ పురోగతికి దోహదపడే విధంగా ఆవిష్కరణ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమ్మిట్ ద్వారా అమరావతిపై గ్లోబల్ దృష్టి నిలుస్తుందని, అంతరిక్ష పరిశోధన, ఆవిష్కరణలు, వ్యాపారారంభాలకు ఇది ఒక కొత్త కేంద్రంగా ఎదుగుతుందని, అంతరిక్ష విప్లవంలో అగ్రగామిగా నిలవడానికి ఆంధ్రప్రదేశ్ కట్టుబాటును ఇది బలపరుస్తుందన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన శ్రీహరికోటలోని మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వీ.శేషగిరి రావు మాట్లాడుతూ దూర ప్రాంతాలకూ టెలివిజన్, మొబైల్ సర్వీసులు, ఇంటర్నెట్ అందించడంలో అంతరిక్ష సాంకేతికత వంతెనలా పనిచేస్తోందన్నారు. దేశీయ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ రవాణా, రక్షణ, అత్యవసర సేవల్లో విశ్వసనీయ మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. చంద్రయాన్%-%1 ద్వారా చంద్రుడిపై నీటి అణువుల ఆవిష్కరణ, మంగళయాన్‌తో మొదటి ప్రయత్నంలోనే మార్స్ కక్ష్యలో ప్రవేశం, చంద్రయాన్%-%3 విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై మృదువైన ల్యాండింగ్ %-% ఇవన్నీ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిన ఘట్టాలని విద్యార్థులతో పంచుకున్నారు. త్వరలోనే మానవ సహిత గగనయాన్ మిషన్ ద్వారా భారత జెండా అంతరిక్షంలో ఎగరనుందని పేర్కొన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం అనేది కేవలం ఒక జ్ఞాపక దినం కాదని, అది దేశ భవిష్యత్తు శాస్త్ర విజ్ఞాన దిశను సూచించే కాంతి స్తంభమన్నారు. ఇస్రో కృషి వల్ల అంతరిక్షం ఇప్పుడు కేవలం శాస్త్రవేత్తల కలలలోనే కాక, ప్రతి భారతీయుడి జీవితంలో ప్రత్యక్ష ప్రయోజనాలను అందిస్తోందన్నారు. అంతరిక్షం పట్ల ఆసక్తి, ఆవిష్కరణ పట్ల నిబద్ధత, స్వయం సమృద్ధి పట్ల కాంక్ష %-% ఇవన్నీ కలిసి భారతదేశాన్ని రేపటి ప్రపంచ అంతరిక్ష శక్తిగా తీర్చిదిద్దుతున్నాయన్నారు.

అనంతరం కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను, గౌరవ అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.వీ.మరళీకృష్ణ, ఏఎస్‌టీసీ సెక్రటరీ సీ.ఎల్.నరసింహారావు, విట్ ప్రొఫెసర్ ఈ.శ్రీనివాస రెడ్డి, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెగాస్టార్ చిరంజీవి జీవితం స్ఫూర్తిదాయకం.

**మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ జనసేన పార్టీ నాయకులు గంజి చిరంజీవి**

**చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని యువతకు పిలుపు**

**జనసేన పార్టీ నాయకులు కంకణాల శంకర ఆధ్వర్యంలో లిటిల్ విలేజ్ నందు మెగా రక్తదాన శిబిరం**

**అంగ రంగ వైభవంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు**

**70 ఏళ్ల వయసులోనూ మెగాస్టార్ క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని కంకణాల శంకర్ స్పష్టికరణ**



మంగళగిరి ఆగస్టు 22 (లక్ష్యం న్యూస్):: మంగళగిరిమెగాస్టార్ చిరంజీవి జీవితం స్ఫూర్తిదాయకం అని మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు రంజి చిరంజీవి అన్నారు. పద్మ విభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు కంకణాల శంకర్ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం చినకాకాని పరిధి లిటిల్ విలేజ్ రెస్టారెంట్ నందు శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత గంజి చిరంజీవి, కంకణాల శంకర్ లు రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో అంచలంచెలుగా ఎదిగారని అన్నారు. చిరంజీవి ఫైట్లు, డ్యాన్సులతో తిరుగులేని, ఎదురులేని స్టార్ గా అభిమానుల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. మెగాస్టార్ నటించిన అనేక చిత్రాలు సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చాయని తెలిపారు. రక్తదానం, నేత్రదానం కార్యక్రమాల ద్వారా ఎంతో మంది ప్రాణాలు నిలిపిన ప్రాణదాత స్ఫూర్తి ప్రదాత చిరంజీవి అని ప్రశంసించారు. ఆయన సోదరుడు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించి సమాజాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. అటువంటి పవన్ కళ్యాణ్ కు చిరంజీవి ఆదర్శమని అన్నారు. మెగాస్టార్ ను స్ఫూర్తిగా తీసుకొని యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**70 ఏళ్ల.వయసులోనూ ఆయన క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు.. కంకణాల శంకర్**

70 ఏళ్ల వయసులోనూ మెగాస్టార్ చిరంజీవి క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు కంకణాల శంకర్ అన్నారు. విశ్వంభర చిత్రానికి సంబంధించి కొన్ని సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. కరోనా సమయంలో మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళగిరి ప్రాంతంలో ఆక్సిజన్ సిలిండర్లను పంపిణీ చేసి ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడినట్లు చెప్పారు. చిత్ర పరిశ్రమకు రాజు రారాజు మెగాస్టార్ చిరంజీవి అని తెలిపారు మెగాస్టార్ స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయన సోదరుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి విశేషమైన కృషి చేస్తున్నారని అన్నారు. మెగాస్టార్ చిరంజీవి మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో లిటిల్ విలేజ్ రెస్టారెంట్ అధినేత కన్నెగంటి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ వీర మహిళ నాయకులు బడే కోమలి, నాయకులు మునగపాటి మారుతి, తోట శీను, నవబోతు తేజ, గుగ్గిళ్ళ సురేష్, చెన్నం వీరాంజనేయులు, సాంబశివరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను ఆస్తి యజమాని పేరుతోనే ఉండాలి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నగర పాలక సంస్థ, గుంటూరు ఆగస్టు 22( లక్ష్యం న్యూస్ ):: ఆస్తి పన్ను ఆస్తి యజమాని పేరుతోనే ఉండాలని, ఆవిధంగా లేని వారు ఈ నెలాఖరు లోపు స్థానిక వార్డ్ సచివాలయంలో దరఖాస్తు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి కార్యక్రమంగా సెప్టెంబర్ 1 నుండి నక్షా (నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషణ్) ప్రకారం రీ సర్వే జరుగుతుందని, సదరు సర్వే మేరకు ఆస్తి పన్ను కల్గిన వారికి ఓనర్ షిప్ కార్డ్ జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కనుక నగరంలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే ఆటో మ్యూటేషన్ జరుగుతుందన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ జరిగి ఆస్తి పన్నులో పేరు మార్పు కాని వారు ఈ నెలాఖరు లోపు వార్డ్ సచివాలయంలో అడ్మిన్ కార్యదర్శికి అటెస్ట్ చేసిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ప్రస్తుత ఆస్తి విలువ (మార్కెట్ వ్యాల్యూ) సర్టిఫికెట్, సెల్ఫ్ డిక్లరేషన్, బకాయిలు చెల్లించిన ఆస్తి పన్ను రశీదు, ఆస్తి యజమాని ఆధార్ నకలు కాపీలను అందించి దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్లను సంప్రదించాలని తెలిపారు.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P. and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. R.N.I. No. APTEL/2013/48712 Editor : CHALLA MADHUSUDHANA RAO